గురువారం
29-06-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 08
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from
Vijayawada, Hyderabad, Visakapatnam,
Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

అమెరికాలో రూ.16 లక్షల కోట్ల అవినీతి

అమెరికాలో భారీ అవినీతి కుంభకోణం బయటకొచ్చింది. కోవిడ్ సమయంలో ఆ దేశంలో చిరు వ్యాపార సంస్థలను ఆదుకోవడానికి ప్రభుత్వం ఇచ్చిన 1.2 ట్రిలియన్ డాలర్ల రుణాల్లో అధిక భాగం దోపిడీకి గురైనట్లు ఎస్‌బీఏ (స్మాల్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్) ఇన్‌స్పెక్టర్ జనరల్ నివేదిక పేర్కొంది.

2 లో

▸ పాత పెన్షన్లకే ఆర్థికశాఖ అనుమతి
▸ దాదాపు లక్షన్నర మందికి నిరాశే
▸ 6 నెలలుగా లబ్ధిదారుల ఎదురుచూపు

జులైలో కొత్త పెన్షన్లు హుళక్కే?

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: జులై 1వ తేదీ నుంచి కొత్త పెన్షన్ల కోసం ఎదురు చూస్తున్న లబ్ధిదారులకు నిరాశే మిగలనుంది. వైఎస్సార్ పింఛను కానుక కింద కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారికి రాష్ట్ర ప్రభుత్వం ఏటా జనవరి, జులై నుంచి మంజూరు చేసి పెన్షన్లు అందజేస్తుంది. ఈ ప్రక్రియలో భాగంగా ఈ ఏడాది జనవరి తర్వాత పెన్షన్‌కు అర్హులైన వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, వికలాంగులు తదితరులు సుమారు లక్షన్నర మందికి పైగా దరఖాస్తు చేసుకున్నారు. వీరంతా జులై 1వ తేదీ కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు. ఏటా జనవరి, జులై నెలల్లో రెండు విడతలుగా మంజూరు చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఆ ప్రకారం 2023 జనవరి నుంచి కొత్తగా దరఖాస్తు చేసుకున్నవారికి పెన్షన్లు అందజేసింది. దీంతో జులై నుంచి కూడా కొత్తవారికి వస్తాయనే ఆశతో ఉన్నారు. కానీ కొత్త పెన్షన్ల మంజూరుకు సంబంధించి ఇంకా ఆర్థికశాఖ ఆమోదం లభించలేదని తెలుస్తోంది. ప్రస్తుతానికి గత నెల ఒకటవ తేదీ మంజూరు చేసిన జాబితా ప్రకారమే ఆర్థిక శాఖ నిధులు

- మిగతా 2 లో

కోర్టు ఆదేశాలనూ అమలు చేయరా?

▸ విద్యాశాఖ కార్యదర్శిపై హైకోర్టు ఆగ్రహం
▸ వ్యక్తిగతంగా హాజరు కావాలని ఆదేశం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: తమ ఆదేశాలను అమలు చేయకపోవడంపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రపాఠశాల విద్యాశాఖ కార్యదర్శి వ్యక్తిగతంగా హాజరు కావాలని ఆదేశించింది. ఎయిడెడ్ పాఠశాలల్లో టీచర్ల నియామకాలపై స్పష్టమైన ఆదేశాలున్నా అమలు చేయకపోవడంపై ఆయనపై కోర్టు ధిక్కరణ కేసు దాఖలైంది. టీచర్ల పోస్టుల

- మిగతా 2 లో

'జగనన్న సురక్ష' వేతలు

కుల, ఆదాయ పత్రాలకు అఫిడవిట్ మెలిక

▸ సచివాలయ సిబ్బంది నిబంధనలు
▸ రుసుము లేదని ప్రభుత్వం గొప్పలు ▸ అర్జీదారుల ఆందోళన

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం జులై 1 నుంచి ప్రవేశపెడుతున్న జగనన్న సురక్ష కార్యక్రమానికి ఆదిలోనే అడ్డంకులు ఎదురవుతున్నాయి. సర్వీసు చార్జీలు లేకుండా ప్రజలకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలను గ్రామ/వార్డు సచివాలయాల ద్వారా జారీ జేయడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం. ఆ దిశగా సీఎం జగన్ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినప్పటికీ క్షేత్రస్థాయిలో దీని అమలుకు అడ్డంకులు ఎదురవుతున్నాయి. జగనన్న సురక్ష ద్వారా 11 రకాల ధ్రువీకరణ పత్రాలను ప్రజలకు ఇవ్వాలని జగన్ ప్రభుత్వం నిర్ణయించింది. ఇంకా సంక్షేమ పథకాలకు ఎవరైనా దూరమై ఉండి... వివిధ సాంకేతిక కారణాల రీత్యా ధ్రువీకరణ పత్రాలు పొందలేక పోతే...వారిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం 11 రకాల ధ్రువీకరణ పత్రాలు అందజేయాలని భావించింది. ఈ కార్యక్రమం ద్వారా కుల ధ్రువీకరణ, ఆదాయ, వివాహ, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు ఇస్తారు. వాటితోపాటు ఆధార్‌కు ఫోన్ నంబరు అనుసంధానం, మ్యుటేషన్ లావాదేవీ, కుటుంబ సభ్యుడి ధ్రువీకరణ పత్రం, పంట సాగు హక్కు కార్డు (సీసీఆర్‌సీ), కొత్త/స్ప్లిట్ రైస్ కార్డు, హౌస్ హోల్డ్ మ్యాపింగ్ విభజన తదితర పత్రాలు జగనన్న సురక్షతో అందజేస్తారు. ఇందులో అవసరమైన ధ్రువీకరణ పత్రాల కోసం 15,004 గ్రామ, వార్డు సచివాలయాల్లో నెల రోజులపాటు ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనుంది. ఈ ధృవీకరణ పత్రాలు కోరే వారంతా, ఆయా సచివాలయాల పరిధిలోని సంబంధిత వలంటీర్ల ద్వారా ముందస్తుగా వివరాలు అందజేయాలి. అలా వివరాలిచ్చిన వారికి టోకెన్లు ఇచ్చి, ఒక సర్వీసు నంబరు కేటాయిస్తారు. 1వ తేదీ నుంచి ఆయా సచివాలయాల పరిధిలో జరిగే క్యాంపుల ద్వారా ధ్రువీకరణ పత్రాలిస్తారు. ఇందులో కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు కోరుతున్న వారికి చుక్కెదురవుతోంది. వారంతా బయట నుంచి అఫిడవిట్ చేయించుకుని దరఖాస్తులు అందజేయాలని వలంటీర్లు స్పష్టం చేస్తున్నారు. కుల, ఆదాయ పత్రాలు పొందే వారికి ఒక్కో దానికి అఫిడవిట్ చేసేందుకుగాను రూ.300 వరకు ఖర్చవుతోంది. అటు ప్రభుత్వమేమో ఎలాంటి రుసుం లేకుండా ధ్రువీకరణ పత్రాలు ఇస్తామని ఆర్భాటంగా ప్రచారం చేస్తోంది. ఇటు

- మిగతా 2 లో

ఎన్నికల వేళ తెరపైకి యూసీసీ వివాదం

▸ దేశ బహుళత్వం, వైవిధ్యంపై దాడి అంటున్న విపక్షాలు
▸ ప్రజల దృష్టి మళ్లించేందుకే: చిదంబరం
▸ ఎస్సీ, ఎస్టీలను ఆలయాల్లోకి అనుమతివ్వండి: డీఎంకే

న్యూఢిల్లీ: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ మోదీ సర్కారు మరోసారి ఉమ్మడి పౌరస్మృతి(యూసీసీ) వివాదాన్ని తెరపైకి తీసుకొచ్చింది. ఉమ్మడి పౌరస్మృతి (యూసీసీ) అమలు దేశ బహుళత్వం, వైవిధ్యంపై దాడి చేయడమేనని ప్రతిపక్షాలు విమర్శించాయి. దేశంలో యూసీసీ అమలుపై భోపాల్‌లో ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలను ప్రతిపక్షాలు తప్పుపట్టాయి. హిందూమతంలో ముందుగా ఉమ్మడి పౌరస్మృతిని అమలు చేయాలని, దేశంలోని ప్రతి ఆలయంలో ఎస్‌టీలు, ఎస్‌సీలు పూజలు చేసేందుకు అనుమతివ్వాలని డీఎంకే నేత టీకేఎస్ ఇళంగోవన్ డిమాండ్ చేశారు. యూసీసీ తమకు అవసరం లేదని, ఎందుకంటే రాజ్యాంగం ప్రతి మతానికి రక్షణ కల్పించిందని అన్నారు. మోదీ ఉమ్మడి పౌరస్మృతి ప్రతిపాదనపై కాంగ్రెస్ నేత పి.చిదంబరం బుధవారం విరుచుకుపడ్డారు. దేశంలో పెరిగిపోతున్న నిరుద్యోగం, ధరల పెరుగుదల, విద్వేషపూరిత నేరాల సమస్యల నుండి దేశ ప్రజల దృష్టి మరల్చేందుకే మోదీ యూసీసీ ప్రతిపాదనను తెరపైకి తీసుకువచ్చారని విమర్శించారు. ప్రజలు

- మిగతా 2 లో

ఏపీకి 'విద్యుత్' వరం

రూ.9,574 కోట్ల రుణానికి కేంద్రం అనుమతి

ఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అప్పులు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం మరో వెసులుబాటును కల్పించింది. విద్యుత్ సంస్కరణలను వేగంగా అమలు చేస్తున్నందుకు రూ. 9,574 కోట్లను రుణాలు తీసుకునేందుకు ఏపీకి కేంద్రం అనుమతి ఇచ్చింది. విద్యుత్ రంగ సంస్కరణలను వేగవంతం చేసేందుకు రాష్ట్రాలకు ఆర్థిక ప్రోత్సాహకాలను కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. 12 రాష్ట్రాలు విద్యుత్ రంగంలో సంస్కరణలకు గాను రూ. 66,413 కోట్ల అప్పులు తీసుకునేందుకు కేంద్రం పచ్చజెండా ఊపింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పరిమితికి మించి విద్యుత్ రంగ సంస్కరణలను వేగవంతం చేసేందుకు కేంద్రం అనుమతి ఇచ్చింది. విద్యుత్ రంగాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు విద్యుత్ వినియోగం ద్వారా ఆదాయం పెంచడానికి, విద్యుత్ రంగంలో సంస్కరణల అమలును వేగవంతం చేసేందుకు రాష్ట్రాలకు కేంద్ర సర్కారు ప్రోత్సాహకాలను ప్రకటించింది. విద్యుత్ రంగ సంస్కరణల కోసం 2023-24లో రూ.1,43,332 కోట్ల రుణాలు తీసుకునేందుకు కేంద్రం ఆమోద ముద్ర వేసింది.

చంద్రయాన్-3 రెడీ

జులై 13న నింగిలోకి

న్యూఢిల్లీ: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ప్రతిష్ఠాత్మకంగా చేపడుతోన్న చంద్రయాన్-3 ఉపగ్రహ ప్రయోగానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. జులై 13 మధ్యాహ్నం 2.30 గంటలకు చంద్రయాన్-3 నింగిలో చంద్రుడి వైపు దూసుకెళ్లనుంది. ఈ విషయాన్ని ఇస్రో అధికారికంగా ప్రకటించింది. ఈ మిషన్‌కు సంబంధించిన పనులు ఇప్పటికే దాదాపు పూర్తయినట్లు సమాచారం. యువ శాస్త్రవేత్త వీరముత్తుయేల్ సారథ్యంలో రూపుదిద్దుకున్న ఈ ఉపగ్రహం అనుసంధాన పనులతోపాటు రోవర్,

- మిగతా 2 లో

భీమ్ ఆర్మీ అధినేతపై హత్యాయత్నం?

2 లో

ఇదీ లోకం!

సక్సెస్, గ్రాండ్ సక్సస్ మన అన్న మళ్లీ అప్పు తెచ్చాడు!

తినుకో... దండుకో... పంచుకో

ఇదే టీడీపీ అర్థం

▸ దత్తపుత్రుడి నోటికి అదుపు లేదు
▸ వైసీపీ ప్రభుత్వంపై దుష్టచతుష్టయం దుష్ప్రచారం
▸ కురుపాంలో సీఎం వైఎస్ జగన్ ▸ తల్లుల ఖాతాల్లోకి అమ్మఒడి నిధులు

విశాలాంధ్ర-కురుపాం/పార్వతీపురం: అధికారం కోసం అమలుకాని హామీలు ఇవ్వడం చంద్రబాబుకు అలవాటేనంటూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విమర్శించారు. టీడీపీ అంటే తినుకో, దండుకో, పంచుకో అంటూ ఎద్దేవా చేశారు. ప్రజలను మోసం చేసేందుకు చంద్రబాబు మళ్లీ డ్రామాలు మొదలుపెట్టారని చెప్పారు. పార్వతీపురం మన్యం జిల్లాలోని కురుపాంలో బుధవారం జరిగిన

- మిగతా 2 లో

అమెరికాలో రూ.16 లక్షల కోట్ల అవినీతి

పక్కదారి పట్టిన కోవిడ్ రుణాలు

వాషింగ్టన్: అమెరికాలో భారీ అవినీతి కుంభకోణం బయటకొచ్చింది. కోవిడ్ సమయంలో ఆ దేశంలో చిరు వ్యాపార సంస్థలను ఆదుకోవడానికి ప్రభుత్వం ఇచ్చిన 1.2 ట్రిలియన్ డాలర్ల రుణాల్లో అధిక భాగం దోపిడీకి గురైనట్లు ఎస్‌బీఏ (స్మాల్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్) ఇన్‌స్పెక్టర్ జనరల్ నివేదిక పేర్కొంది. ప్రభుత్వం మొత్తం రెండు దశలుగా విడుదల చేసిన ఆర్థిక సహాయంలో 200 బిలియన్ డాలర్ల (రూ.16లక్షల కోట్ల) మేరకు అవినీతి చోటు చేసుకొందని వెల్లడించింది. తప్పుడు క్లెయిమ్‌ల ద్వారా వీటిని దోచుకొన్నట్లు గుర్తించారు. కోవిడ్ సమయంలో చిరు వ్యాపారాలను కాపాడేందుకు అమెరికాలో 'పే చెక్ ప్రొటెక్షన్ ప్రోగ్రాం' (పీపీపీ), ది ఎకనామిక్ ఇంజూరి డిజాస్టర్ లోన్స్ (ఈఐడీఎల్) కార్యక్రమాలను చేపట్టారు. ఇందుకోసం 1.2 ట్రిలియన్ డాలర్లను మంజూరు చేశారు. వీటిల్లో కనీసం

17శాతం రుణాలు అందవలసిన వారికి అందకుండా పోయినట్లు తేలింది. ముఖ్యంగా ఈఐడీఎల్ కార్యక్రమంలో అత్యధికంగా 33శాతానికి సమానమైన 136 బిలియన్ డాలర్ల మేరకు మోసాలు జరగ్గా, పీపీపీ కార్యక్రమంలో మరో 64 బిలియన్ డాలర్ల వరకు లెక్కతప్పాయి. ఈ కార్యక్రమాల కింద 2.21 కోట్ల రుణాలు ఇవ్వగా, వీటిల్లో 45 లక్షల రుణాలు మోసకారుల చేతికి వెళ్లాయి. "కోవిడ్ సమయంలో వీలైనంత తొందరగా సొమ్మును లబ్ధిదారులకు చేర్చే క్రమంలో ఎస్‌బీఏ నిబంధనలు సడలించింది. అర్హులైన లబ్ధిదారులకే ఆర్థిక సాయం అందుతుందని భావించింది. మరోవైపు ఆర్థిక సంక్షోభ సమయంలో తేలిగ్గా సొమ్ము లభిస్తుండటంతో ఆర్థిక మోసగాళ్లు పెద్దఎత్తున ఈ పథకం కింద డబ్బు పొందారు" అని ఎస్‌బీఏ ఐజీ ఆ నివేదికలో పొందు పర్చారు. దీంతో ఆ తర్వాత పలు ఫెడరల్ ఏజెన్సీలు రంగంలోకి దిగి కనీసం 30 బిలియన్ డాలర్ల మొత్తాన్ని సీజ్ చేశాయని నివేదిక పేర్కొంది. ఈ విషయమై ఒక్క మే నెలలోనే 803 మందిని అరెస్టు చేయగా 529 మందికి శిక్ష పడిందని పేర్కొంది. ఈ భారీ అవినీతికి సంబంధించి ఎస్‌బీఏ ఐజీ వేల కొద్దీ కేసులను దర్యాప్తు చేస్తోంది.

ఉక్రెయిన్‌పై క్షిపణి దాడి

కీవ్/మాస్కో: ఉక్రెయిన్‌పై మరోసారి రష్యా క్షిపణితో దాడి చేసింది. ఈ దాడిలో ఎనిమిది మంది మరణించగా, 50మందికి పైగా గాయాల పాలయ్యారు. ఉత్తర ఉక్రెయిన్‌లోని క్రామటోర్స్క్‌లో మంగళవారం రాత్రి 7.30 గంటల సమయంలో ఈ దాడి జరిగినట్లు ఉక్రెయిన్ మిలిటరీ అధికారులు వెల్లడించారు. ప్రజలు ఎక్కువగా తిరిగే ప్రాంతంలో క్షిపణి దాడి జరిగిందని వారు వివరించారు. దీనిపై సమాచారం అందుకుని సహాయక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. మరోవైపు ఉక్రెయిన్‌కు అమెరికా భారీ ఆర్థిక సాయాన్ని ప్రకటించింది. అదనపు భద్రతా సాయం కింద 500 మిలియన్ డాలర్లు ఇస్తున్నట్లు తెలిపింది. రష్యా చేస్తున్న దాడులకు కౌంటర్ చేసేందుకు వాయురక్షణ వ్యవస్థల బలోపేతం కోసం ఈ నిధులు ఉపయోగించనున్నట్లు తెలిపింది.

బెలారస్ చేరుకున్న ప్రిగోజిన్

ప్రిగోజిన్ మంగళవారం ఉదయం బెలారస్ రాజధాని మిన్స్క్ లో దిగారు. ఈ విషయాన్ని బెలారస్ అధ్యక్షుడు అలెగ్జాండర్ లుకషెంకో ధ్రువీకరించారు. వారి సొంత ఖర్చులపై ప్రిగోజిన్, ఆయన అనుచరులు కొం తకాలం తమదేశంలో ఉండవచ్చని చెప్పారు.

వాగ్నర్ గ్రూపునకు రూ.8 వేల కోట్లు ఇచ్చాం: పుతిన్

రష్యాలో ఇటీవల తిరుగుబాటు చేసి వెనక్కి వెళ్లిన వాగ్నర్ గ్రూపునకు కేవలం ఏడాదిలోనే దాదాపు రూ.8వేల కోట్లకు పైగా చెల్లిం చినట్లు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ తెలిపారు. ఉక్రెయిన్‌పై చేస్తోన్న సైనిక చర్యలో పాల్గొన్న

వాగ్నర్ గ్రూపు సైనికులకు జీతాలు, ఇతర రివార్డుల రూపంలో వీటిని అందించినట్లు ఆయన వెల్లడించారు. రక్షణశాఖ అధికారులతో మాస్కోలో నిర్వ హించిన సమావేశంలో రష్యా అధ్యక్షుడు పుతిన్ ఈ వివరాలు వెల్లడించారు.

'మే 2022 నుంచి మే 2023 మధ్య కాలంలో వాగ్నర్ గ్రూపు బలగాలకు జీతాలు, ఇతర అలవెన్సుల రూపంలో 86.26 బిలియన్ రూబుల్స్ను రష్యా ప్రభుత్వం చెల్లించింది. సైనిక చర్యలో పాల్గొన్న వారికి అన్ని వనరులను ప్రభుత్వమే సమకూరుస్తోంది. వీటిని రక్షణశాఖ, ప్రభుత్వ బడ్జెట్ల నుంచే అందిస్తున్నాం . మనమే ఆ గ్రూపునకు పూర్తిగా నిధులు సమకూర్చాం' అని రక్షణశాఖ అధికారులతోవ్లాదిమిర్ పుతిన్ తెలిపారు.

మోదీని ప్రశ్నించిన మహిళా జర్నలిస్టుకు వేధింపులు

న్యూయార్క్: అమెరికా అధ్యక్షుడి అధికారిక భవనం శ్వేతసౌధంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో భారత్‌లో మానవ హక్కులపై ప్రధాని మోదీని ప్రశ్నించిన మహిళా జర్నలిస్టు సబ్రినా సిద్ధిఖీ ఆన్‌లైన్‌లో వేధింపులకు గురయ్యారు. పాకిస్తాన్ ఇస్లామిస్ట్ అంటూ ఆమెపై ముద్ర వేశారు. ఈ చర్యను అమెరికా ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది. యూఎస్ నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ అధికార ప్రతినిధి జాన్ కిర్బీ దీనిపై స్పందించారు. 'జర్నలిస్ట్‌పై వేధింపులకు పాల్పడడం ఎంత మాత్రం ఆమోదయోగ్యం కాదు. గతం వారం విలేకరుల సమావేశం సందర్భంగా మోదీ ప్రదర్శించిన ప్రజాస్వామ్య విలువలకు ఇది విరుద్ధ చర్య' అని పేర్కొన్నారు. శ్వేతసౌధం ప్రెస్ సెక్రెటరీ కరీన్ జీన్ పెర్రీ మాట్లాడుతూ... బైడెన్ పాలనలో అమెరికా ప్రభుత్వం పత్రికా స్వేచ్ఛకు కట్టుబడి ఉందన్నారు. అందుకే ప్రభుత్వం తరపున మీడియా ప్రతినిధుల సమావేశం నిర్వహించామని తెలిపారు. వాల్ స్ట్రీట్ జర్నల్‌కు చెందిన సబ్రినా సిద్ధిఖీ భారత్‌లో మైనారిటీలపై దాడులు, మానవ హక్కుల ఉల్లంఘనలపై ప్రధాని మోదీని ప్రశ్నించారు. ఈ ఘటన జరిగిన తర్వాతి రోజు నుంచే సదరు జర్నలిస్టుపై వేధింపులు మొదలయ్యాయి. ఇప్పటికే భారత్‌లో మానవ హక్కుల ఉల్లంఘనలపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పత్రికా స్వేచ్ఛను బీజేపీ ప్రభుత్వం తుంగలో తొక్కుతోందన్న విమర్శలకు ఈ ఘటనే నిదర్శనం. కాగా సౌత్ ఏషియన్ జర్నలిస్ట్ అసోసియేషన్ (ఎస్ఏజేఏ) సిద్ధిఖీపై వేధింపులను తీవ్రంగా ఖండించింది. 'దక్షిణాసియాలోని మహిళా జర్నలిస్టులు వేధింపులకు గురవుతున్నారు. సిద్ధిఖీకి అండగా ఉంటాం' అని ఎస్ఏజేఏ తెలిపింది. కాగా ఆన్‌లైన్ వేధింపులపై సిద్ధిఖీ స్పందిస్తూ... 'కొంతమంది నన్ను టార్గెట్ చేస్తూ నా వ్యక్తిగత అంశాలను ఎంచుకుంటున్నారు. అటువంటి సమయాల్లో గుర్తింపును నిరూపించుకోవాల్సి వస్తున్నది. కొన్నిసార్లు గుర్తింపు అనేది... అది కనిపించే దాని కంటే కఠినంగా ఉంటుంది' అని ఆమె ట్వీట్ చేశారు. 2011 క్రికెట్ ప్రపంచకప్ సమయంలో భారత జెర్సీని ధరించి తన తండ్రితో పాటు క్రికెట్ చూస్తున్న ఫొటోలను ఆమె ట్విట్టర్‌లో ఉంచారు.

పాక్‌లో ఒకే కుటుంబానికి చెందిన 9మంది దారుణహత్య

పెషావర్: పాకిస్తాన్‌లో ఒకే కుటుంబానికి చెందిన తొమ్మిది మంది హత్యకు గురయ్యారు. గుర్తు తెలియని దుండగులు ఒక కుటుంబాన్ని దారుణంగా కాల్చి చంపారు. ఈ ఘటన బుధవారం వాయువ్య పాకిస్తాన్ లోని మలకంద్ జిల్లాలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వాయువ్య పాకిస్తాన్‌లోని మలకంద్ జిల్లా బత్కెలా తహసీల్ లో ఒక కుటుంబం నివసిస్తోంది. బుధవారం గుర్తు తెలియని దుండగులు తుపాకీతో వారి ఇంటిపై దాడి చేశారు. తొమ్మిది మందిని అతి కిరాతకంగా కాల్చారు. దాంతో వారు అక్కడికక్కడే మరణించారు. మృతుల్లో ముగ్గురు మహిళలు, ఆరుగురు పురుషులు ఉన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాలను పోస్టుమార్టంకు తరలించారు. అయితే ఆ దుండగులు ఎవరనేది తెలియదు.

'జగనన్న సురక్ష' వెతలు

(మొదటిపేజీ తరువాయి)

సచివాలయ సిబ్బంది అందుకు భిన్నంగా వ్యవహరించడంపై ప్రజలలో గందరగోళం నెలకొంది.

వేసవి సెలవులు అనంతరం విద్యా సంస్థల్ని పున:ప్రారంభించడంతో ప్రతి విద్యార్థికి కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల అవసరత ఉంది. దీంతో అధికంగా ఈ రెండు పత్రాల కోసమే దరఖాస్తు చేసుకుంటున్నారు. వాటికి అఫిడవిట్ చేసి ఇవ్వాలనే నిబంధనతో చాలామంది ఇబ్బందులకు గురవుతున్నారు.

పాతవి ఉన్నా అఫిడవిట్ ఇవ్వాల్సిందే

గతంలో గ్రామ/వార్డు సచివాలయ వ్యవస్థ ద్వారా కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలను చాలామంది తీసుకున్నారు. విద్యాసంస్థల నిబంధనల మేరకు తాజాగా ధ్రువీకరణ పత్రాలు కోరడంతో మళ్లీ విద్యార్థులు వాటి కోసం దరఖాస్తు చేయాల్సిన దుస్థితి ఎదురవుతోంది. దీంతో దరఖాస్తుతోపాటు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలను జతచేసి ఇస్తే, వారికి తాజాగా ఇచ్చేందుకు అవకాశం ఉంటుంది. వాటికి విరుద్ధంగా అఫిడవిట్ ఉంటేనే దరఖాస్తులను వలంటీర్లు స్వీకరిస్తున్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలకు అఫిడవిట్ విధానాన్ని తొలగించాల్సిన అవసరం ఉంది.

26 జిల్లాలకు సీనియర్ ఐఏఎస్ అధికారులు

జగనన్న సురక్ష కోసం 26 జిల్లాలకు ప్రత్యేక సీనియర్ ఐఏఎస్ అధికారులను పర్యవేక్షణ అధికారులుగా నియమించారు. జిల్లా కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, ఇతర అధికారులు సైతం క్యాంపుల్లో ఉంటారు. అక్కడ సేవలందుతున్న తీరుపై ఆరా తీస్తారు. అధికారులతోపాటు వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, గృహసారథులు, ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేస్తున్నారు. ఇంత ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న జగనన్న సురక్షలో ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలకు అఫిడవిట్‌లు అడగడంతో దరఖాస్తుదారులకు జాప్యం జరుగుతోంది. కొత్త రైస్ కార్డుల జారీ, చేర్పులు, మార్పుల సమయంలోనూ వివిధ సాకులు చూపుతున్నట్లు సమాచారం. ఫ్యామిలీ, జనన, మరణాల ధ్రువీకరణ పత్రాల జారీలోనూ సమస్యలు ఎదురవుతున్నాయి. జనన ధ్రువీకరణ పత్రాల కోసం సంబంధిత మున్సిపల్ కార్యాలయం నుంచి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ నిబంధన విధిస్తున్నారు. ఇలా ప్రతిదానికి ఏదో ఒకసాకు చూపడంతో అర్జీదారులు అసౌకర్యానికి గురవుతున్నారు. ధ్రువీకరణ పత్రాల కోసం ఇన్ని నిబంధనలు పెట్టడంపై మండిపడుతున్నారు. అలాంటప్పుడు జగనన్న సురక్ష ఇంకెందుకని ప్రశ్నిస్తున్నారు. సీఎం జగన్ స్పందించి జగనన్న సురక్షలో భాగంగా ఎలాంటి రుసుముల భారం పడకుండా, ఇబ్బందికర నిబంధనలు లేకుండా ధ్రువీకరణ పత్రాలు అందజేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

తినుకో... దండుకో... పంచుకో

(మొదటిపేజీ తరువాయి)

కార్యక్రమంలో అమ్మఒడి పథకం కింద లబ్ధిదారులైన తల్లుల బ్యాంకు ఖాతాల్లోకి నిధులను విడుదల చేశారు . ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో సీఎం జగన్ ప్రసంగించారు. పది రోజుల పాటు జగనన్న అమ్మఒడి కార్యక్రమాన్ని పండుగలా నిర్వహిస్తున్నామని చెప్పారు. అమ్మఒడి పథకం కింద ఇప్పటివరకు రూ. 26,067.28 కోట్లు ఖర్చు చేశామన్నారు. నాలుగేళ్లలో విద్యారంగంపై తమ ప్రభుత్వం రూ. 66,722.36 కోట్లు ఖర్చు చేశామని, 83 లక్షల మంది విద్యార్థులకు అమ్మఒడి ద్వారా లబ్ధి జరగనుందని సీఎం జగన్ చెప్పారు. ప్రపంచస్థాయిలో పిల్లలు పోటీ పడేలా తీర్చిదిద్దుతున్నామన్నారు. అంతేకాదు ప్రపంచాన్ని ఏలే పరిస్థితికి మన విద్యార్థులు ఎదగాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామన్నారు. రానున్న తరం మన కంటే బాగుండాలనే ఉద్దేశంతో తమ ప్రభుత్వం పనిచేస్తుందని సీఎం చెప్పారు. ఇక టీడీపీ అధినేత చంద్రబాబునాయుడుపై ఆయన తీవ్రంగా విమర్శలు గుప్పించారు. 2014లో అధికారంలోకి వచ్చిన తర్వాత చంద్రబాబు టీడీపీ ఎన్నికల మేనిఫెస్టోను తుంగలో తొక్కారన్నారు. దుష్ట చతుష్టయం సమాజాన్ని చీల్చుతోందన్నారు.రాష్ట్రంలో మంచి చేస్తున్నందుకుగాను దుష్టచతుష్టయం తమ ప్రభుత్వంపై విష ప్రచారం చేస్తోందని, నమ్మించి ప్రజలను నట్టేట ముంచటమే వారికి తెలిసిన ఏకైక నీతి అని ఆయన వ్యాఖ్యానించారు. సామాజిక న్యాయంలో, పౌర సేవలు, సంక్షేమ పథకాల అమలులో తమ పునాదులున్నాయని సీఎం జగన్ వివరించారు. వెన్నుపోటు, అబద్ధాలపై తమ పునాదులు లేవని సీఎం జగన్ ఎద్దేవా చేశారు. తమ పునాదులు ఓదార్పు యాత్ర నుండి పుట్టిన విషయాన్ని సీఎం జగన్ గుర్తు చేశారు. రాష్ట్రంలో పేదలకు మంచి చేస్తున్నందుకు చంద్రబాబుకు కడుపు మంటగా ఉందన్నారు. మూడు దఫాలు సీఎంగా పనిచేసినా కూడా ప్రజలకు ఏ మంచి పని చేయని చరిత్ర చంద్రబాబుదని జగన్ విమర్శించారు. మన రాష్ట్రంలో మంచి చేయవద్దని చెప్పే నాలుగు కోతులున్నాయని సీఎం జగన్ ఎద్దేవా చేశారు. మంచి వినవద్దు, మంచి కనవద్దు, మంచి అనవద్దు, మంచి చేయవద్దు అనేది వారి విధానమన్నారు. మహాత్మాగాంధీ చెప్పిన మూడు కోతుల కథను గుర్తు చేస్తూ నాలుగు కోతుల కథ గురించి సీఎం జగన్ వివరించారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ నోటికి అదుపు లేదు...నిలకడ లేదని సీఎం వైఎస్ జగన్ విమర్శించారు. ప్యాకేజీ స్టార్ ఓ లారీ ఎక్కి ఊగిపోతూ తనకు నచ్చనివారిని చెప్పుతో కొడతానంటాడు... తాట తీస్తానంటాడని మండిపడ్డారు. ఆయన లాగా మనం నలుగురిని పెళ్లి చేసుకోని భార్యలను మార్చలేమని, పెళ్లి అనే బంధాన్ని రోడ్డుపైకి తీసుకు వచ్చారన్నారు. దత్తపుత్రుడిలా తొడలు కొట్టలేం, బూతులు తిట్టలేమని ఇవన్నీ వారికే చెందిన పేటెంట్ అంటూ పవన్ కళ్యాణ్‌ను సీఎం జగన్ తీవ్రంగా విమర్శించారు. దత్తపుత్రుడికి నిలకడ లేదు... మాట మీద నిలబడే పరిస్థితి లేదని చెప్పారు. దత్తపుత్రుడిలా పూనకం వచ్చినట్టుగా మనం బూతులు తిట్టలేమన్నారు. 2014లో చంద్రబాబుకు పవన్ కళ్యాణ్ మద్దతు ప్రకటించారన్నారు. టీడీపీ ఎన్నికల మేనిఫెస్టోను అమలు చేస్తామని ప్రతి ఇంటికి చంద్రబాబు, పవన్ కళ్యాణ్ లు సంతకాలు పెట్టిన కరపత్రాలు పంచారన్నారు. 2014లో టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నికల మేనిఫెస్టోను చంద్రబాబు తుంగలో తొక్కారన్నారు. కానీ చంద్రబాబునాయుడు ఎన్నికల మేనిఫెస్టోను అమలు చేయకపోతే పవన్ కళ్యాణ్ ఎందుకు నోరు మెదపలేదో చెప్పాలని సీఎం జగన్ ప్రశ్నించారు.

యూసీసీ వివాదం

(మొదటిపేజీ తరువాయి)

అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సమాజాన్ని విభజించేందుకు బీజేపీ యూసీసీని వాడుకుంటున్నదని మండిపడ్డారు. మోదీ సర్కార్ యూసీసీని ప్రజలపై బలవంతంగా రుద్దదని, ఎందుకంటే ప్రజల మధ్య విభజనను వ్యాప్తి చేయడమే దాని ప్రధాన అజెండా అని అన్నారు. యూసీసీని ఓ సాధారణ ప్రక్రియలా కనిపించేలా మోదీ చేస్తున్నారని, అయితే ఇది ఆచరణ సాధ్యం కాదని గత లా కమిషన్ నివేదికను చదవాలని హితవు పలికారు. బీజేపీ మాటలు, చేతల కారణంగా దేశం విడిపోయిందని, ప్రజలపై విధించే యూసీసీ విభజనను మరింత విస్తృతం చేస్తుందని అన్నారు. సుపరిపాలన అందించడంలో విఫలమైన బీజేపీ... ఓటర్లను విభజించేందుకు, వచ్చే ఎన్నికల్లో విజయం సాధించేందుకు యూసీసీ ప్రతిపాదనను తెరపైకి తీసుకువచ్చిందని మండిపడ్డారు. యూసీసీని ఎక్కువ చేసి చూపించడానికి దేశాన్ని ఒక కుటుంబంతో ప్రధాని సమానం చేశారని, ప్రజల కోణంలో ఇది నిజమేననే భావన కలుగుతుందని, కానీ వాస్తవికతలో భిన్నంగా ఉంటుందని చిదంబరం పేర్కొన్నారు. ఓ కుటుంబం రక్తసంబంధాలతో ముడిపడి ఉంటుందని, కానీ దేశం రాజ్యాంగం ద్వారా ఓ చోటకు చేర్చబడుతుందని అన్నారు. కుటుంబంలో వైవిధ్యమున్నట్లే, రాజ్యాంగం భారతదేశంలోని ప్రజల మధ్య వైవిధ్యం, భిన్నత్వానికి గుర్తింపునిచ్చిందని తెలిపారు.

ప్రధాని మొదట దేశంలో పెరుగుతున్న పేదరికం, ధరల పెరుగుదల, నిరుద్యోగంపై స్పందించాల్సి ఉందని కాంగ్రెస్ నేత కేసీ వేణుగోపాల్ పేర్కొన్నారు. ఒకవైపు మణిపూర్ మండిపోతోందని, కానీ ప్రధాని మణిపూర్ అంశంపై ఎటువంటి వ్యాఖ్యలు చేయలేదని అన్నారు. ట్రిపుల్ తలాక్ అనేది ఇస్లాంలో విడదీయరాని భాగమైతే పాకిస్తాన్, బంగ్లాదేశ్, ఈజిప్ట్, ఇండోనేషియా, ఖతార్, జోర్డాన్, సిరియా వంటి ముస్లిం మెజారిటీ దేశాల్లో ఎందుకు పాటించడం లేదని ప్రశ్నించారు. యూసీసీపై ముస్లిం వర్గాన్ని ప్రతిపక్షాలు రెచ్చగొడుతున్నాయని ప్రధాని తన ప్రసంగంలో ఆరోపించారు. ప్రజలకు రెండు రకాల నిబంధనలు ఉంటే ఒక కుటుంబంలా ఎలా పనిచేస్తుందని, అప్పుడు దేశం ఎలా పనిచేస్తుందని ఆయన ప్రశ్నించారు. ఒకవేళ ఉమ్మడి పౌరస్మృతి కావాలంటే దాన్ని పార్లమెంట్‌లో బీజేపీ ప్రవేశపెట్టవచ్చని, వాళ్లను ఎవరు అడ్డుకున్నారని కాంగ్రెస్ నేత అధిర్ రంజన్ చౌదరి ప్రశ్నించారు. పార్లమెంట్‌లో యూసీసీని ప్రవేశపెట్టకుండా, ప్రతిపక్షాలపై ఎందుకు ఆరోపణలు చేస్తున్నారని ఆయన విమర్శించారు. భారత్‌లో ఉన్న బహుళత్వాన్ని, భిన్నత్వాన్ని మోదీ సమస్యగా చూస్తున్నారని, యూసీసీ పేరుతో దేశ ఔన్నత్యాన్ని తగ్గిస్తారా అని ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ మండిపడ్డారు.

చంద్రయాన్-3 రెడీ

(మొదటిపేజీ తరువాయి)

ల్యాండర్ బిగింపు పనులు ఏకకాలంలో చేస్తున్నారు. శ్రీహరికోటలోని షార్ నుంచి జీఎస్ఎల్‌వీ ఎం-3 భారీ వాహకనౌక ద్వారా ఈ ప్రయోగం చేపట్టనున్నారు. ఈ ప్రాజెక్టు కోసం కేంద్ర ప్రభుత్వం రూ.615 కోట్లు కేటాయించింది. ఇస్రో చంద్రయాన్-1ను 2008లో చేపట్టగా.. అది విజయవంతంగా చంద్రుడి ఉపరితలంపై నీటి జాడలను గుర్తించిన విషయం విదితమే. అయితే, అది రెండేళ్ల పాటు పనిచేసే విధంగా రూపొందించినప్పటికీ... దాదాపు ఏడాదిలోనే దాంతో సంబంధాలు తెగిపోయాయి. చంద్రుడి చుట్టూ తిరుగుతూ మొత్తం 312 రోజులు సేవలు అందించిన తర్వాత ఆ మిషన్ ముగిసినట్లు 2009 ఆగస్టులో ఇస్రో ప్రకటించింది. అనంతరం చంద్రుడి దక్షిణ ధ్రువాన్ని ఆవిష్కరించడమే లక్ష్యంగా ఇస్రో చేపట్టిన చంద్రయాన్-2... చంద్రుడి ఉపరితలంపై సాఫ్ట్ ల్యాండింగ్ సమయంలో విఫలమైంది. అయినప్పటికీ ఎనిమిది సాంకేతిక పరికరాలతో కూడిన ఆర్బిటర్ మాత్రం ఇప్పటికీ చంద్రుడి కక్ష్యలో విజయవంతంగా తిరుగుతోంది. ఇక చంద్రయాన్-3 అనేది చంద్రుని ఉపరితలంపై సురక్షితమైన ల్యాండింగ్, రోవింగ్‌లో ఎండ్-టు-ఎండ్ సామర్థ్యాన్ని ప్రదర్శించడానికి చంద్రయాన్-2కి ఫాలో-ఆన్ మిషన్... ఇది ల్యాండర్, రోవర్ కాన్ఫిగరేషన్‌ను కలిగి ఉంటుంది. దీనిని శ్రీహరికోటలోని ఎస్‌డిఎస్‌సి షార్ నుంచి ప్రయోగిస్తారు. చంద్రయాన్ 2 ల్యాం డింగ్ విఫలమైన నేపథ్యంలో ఈసారి చంద్రుని ఉపరితలంపై దిగేటప్పుడు ప్రత్యేక రక్షణను అందించేలా ప్రత్యేక సాంకేతికతలతో చంద్రయాన్-3ని ప్రయోగించబోతున్నారు. చంద్రయాన్ 3 ప్రయోగ తేదీ జులై 13, 2023 కాగా చంద్రునిపై దిగే తేదీ 23 ఆగస్టు 2023 గా ఇస్రో పేర్కొంది. తాజాగా చేపడుతోన్న చంద్రయాన్-3 ప్రయోగం విజయవంతమైతే భారత అంతరిక్ష పరిశోధనలో కీలక అడుగుపడినట్లే.

కోర్టు ఆదేశాలనూ అమలు చేయరా?

(మొదటిపేజీ తరువాయి)

నియామకాలు చేపట్టడం లేదని విద్యాసంస్థల యాజమాన్యాలు కోర్టును ఆశ్రయించాయి. ఈ విషయమై కోర్టు బుధవారం విచారణ జరిపింది. కోర్టు ఉత్తర్వులు అమలు చేయకపోగా నిర్వీర్యం చేస్తున్నారని హైకోర్టు వ్యాఖ్యలు చేసింది. 2013 నుండి విద్యాశాఖలో పనిచేసిన అందరు అధికారులు ఇందుకు బాధ్యులేనని స్పష్టంచేసింది. ఎయిడెడ్ స్కూళ్లలో రేషనలైజేషన్‌పై ఇచ్చిన జీవోను అడ్వకేట్ జనరల్ కోర్టు దృష్టికి తెచ్చారు. ప్రభుత్వ ఉత్తర్వులకు దీనికి ఏమైనా సంబంధం ఉందా అని హైకోర్టు ప్రశ్నిస్తూ... ఈ కేసు విచారణ సోమవారానికి వాయిదా వేసింది. గతంలో కొందరు ఉన్నతాధికారులను కోర్టు ముందు హాజరు కావాలని ఏపీ హైకోర్టు ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. మరోవైపు కొందరు అధికారులకు శిక్షలు కూడా విధించింది. అయితే ఉన్నతాధికారుల విన్నపం మేరకు కొన్ని శిక్షలను కోర్టు తగ్గించడమో, రద్దు చేయడమో చేసింది. ఇంత జరిగినా ఉన్నతాధికారులు కోర్టు ఆదేశాలను అమలు చేయడంలో నిర్లక్ష్యం కనబరుస్తున్నారు.

కోటలో ఏం జరుగుతోంది?

రెండు నెలల్లో 9 మంది విద్యార్థుల ఆత్మహత్య

కోటా: రాజస్థాన్‌లోని కోటలో మరోసారి విషాదం చోటుచేసుకుంది. వేర్వేరు కోచింగ్ సెంటర్లలో నీట్ పరీక్ష కోసం సిద్ధమవుతున్న ఇద్దరు విద్యార్థులు ఒకే రోజు ఆత్మహత్యకు పాల్పడ్డారు. వీరితో కలిపి కోటాలో గడచిన రెండు నెలల వ్యవధిలోనే తొమ్మిది మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకుని చనిపోయారు. విద్యార్థుల వరుస ఆత్మహత్యలు ప్రస్తుతం స్థానికంగా కలకలం రేపుతున్నాయి. దీంతో అసలు కోటాలో ఏం జరుగుతుందనే ప్రశ్నలు అంతటా వ్యక్తమవుతున్నాయి. పూర్తి వివరాల్లోకి వెళ్తే.. ఉదయపూర్‌కు చెందిన 18 ఏళ్ల విద్యార్థి మంగళవారం తన హాస్టల్ గదిలో ఉరివేసుకుని చనిపోయాడు. అతడిని మెహుల్ వైష్ణవ్‌గా పోలీసులు గుర్తించారు. ఉదయ్‌పూర్ జిల్లాలోని సలుంబర్ నివాసి అయిన వైష్ణవ్.. రెండు నెలలుగా ఓ కోచింగ్ సెంటర్లో నీట్ పరీక్షకు కోచింగ్ తీసుకుంటున్నాడు. ప్రస్తుతం విజ్ఞాన్ నగర్‌లో ఉన్న హాస్టల్‌లో ఉంటున్నాడు. ఈ ఘటన జరిగిన రోజు తన రూమ్‌మేట్ బయటికి వెళ్లాడు. మంగళవారం ఉదయం రూంలో ఒంటరిగా ఉన్న వైష్ణవ్.. గంటలు గడిచినా బయటికి రాకపోవడంతో అతని హాస్టల్‌మేట్స్ వార్డెన్‌కు సమాచారం ఇచ్చారు. వార్డెన్ వచ్చి తలుపులు బద్దలు కొట్టి చూడగా వైష్ణవ్ ఉరివేసుకుని కనిపించాడు. ఘటనా స్థలంలో ఎలాంటి సూసైడ్ నోట్ లభించలేదని పోలీసులు తెలిపారు. విద్యార్థి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. అచ్చం ఇలాంటి ఘటనే మరో చోట కూడా జరిగింది. మరో కోచింగ్ సెంటర్‌లో నీట్ పరీక్షకు కోచింగ్ తీసుకుంటున్న ఆదిత్య అనే విద్యార్థి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దాదాపు రెండు నెలల క్రితం ఆదిత్య కోచింగ్ కోసం కోటాకు వచ్చినట్టు పోలీసులు గుర్తించారు. మే నెలలో ఐదు మంది, జూన్‌లో నలుగురు ఆత్మహత్యకు పాల్పడ్డారు. అయితే విద్యార్థుల ఆత్మహత్యలకు స్పష్టమైన కారణాలు ఇంకా తెలియలేదు. చదువులో ఒత్తిడితోనే విద్యార్థులు ఆత్మహత్య చేసుకుని ఉంటారని అనుమానిస్తున్నారు.

జులైలో కొత్త పెన్షన్లు హుళక్కే?

(మొదటిపేజీ తరువాయి)

మంజూరు చేసినట్లు సమాచారం. జూన్ 1వ తేదీ లెక్కల ప్రకారం 63.14 లక్షల మందికి పెన్షన్లు ప్రభుత్వం ఇస్తోంది. వీరిలో వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులతోపాటు వివిధ చేతివృత్తిదారులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు ఉన్నారు. ప్రతి నెలా 1వ తేదీ నుంచి 5వ తేదీ వరకు పెన్షన్లు ఇస్తున్నారు. ఈ సంఖ్యకు కొత్తగా మరో లక్షన్నర మంది లబ్ధిదారులు చేరనున్నారు. కొత్తవారికి ఆగస్టు 1వతేదీ నుంచి ఇచ్చే అవకాశం ఉందని అధికారవర్గాలు పేర్కొంటుండగా, ఆరు నెలలుగా జులై కోసం ఎదురుచూస్తున్న దరఖాస్తుదారులు నిరాశచెందుతున్నారు. గత ఏడాది కూడా ఒక నెల ఆలస్యం చేసి, ఆగస్టు నెల నుంచే కొత్త పెన్షన్లు పంపిణీ చేశారు.

రూ.225 కోట్లతో టీసీఎల్ యూనిట్: కేటీఆర్

విశాలాంధ్ర-హైదరాబాద్: తెలంగాణలో మరో పెద్ద కంపెనీ పెట్టుబడి పెట్టబోతోంది. ప్రపంచంలోనే అతిపెద్ద కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ మాన్యుఫాక్చరింగ్ కంపెనీ అయిన 'టీసీఎల్ గ్లోబల్' తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చింది. ముందుగా రూ.225 కోట్ల పెట్టుబడితో తన యూనిట్‌ను ఏర్పాటు చేయనున్నది. దాంతో రాష్ట్రంలో 500 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభ్యంకానున్నాయి. ఈ విషయాన్ని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ ట్విటర్ ద్వారా వెల్లడించారు. 'ప్రపంచంలోనే అతిపెద్ద కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ మాన్యుఫాక్చరింగ్ కంపెనీ అయిన 'టీసీఎల్ గ్లోబల్'ను తెలంగాణ రాష్ట్రానికి ఆహ్వానిస్తుండటం నాకు చాలా సంతోషంగా ఉంది. ఈ కంపెనీ ఏర్పాటు చేయబోతున్న నూతన ఎలక్ట్రానిక్స్ మాన్యుఫాక్చరింగ్ యూనిట్‌లో వాషింగ్ మెషిన్‌లను ఉత్పత్తి చేయనున్నారు. భవిష్యత్తులో రిఫ్రిజిరేటర్‌లను కూడా ఉత్పత్తి చేసే ప్రణాళికతో కంపెనీ ఉన్నది' అని మంత్రి ట్వీట్ చేశారు. 'ముందుగా టీసీఎల్ సంస్థ రూ.225 కోట్లతో యూనిట్‌ను ప్రారంభించనుంది.

పీవీ తెలంగాణ ఠీవీ: కేసీఆర్

విశాలాంధ్ర - హైదరాబాద్: భారత మాజీ ప్రధాని, తెలంగాణ ముద్దుబిడ్డ పీవీ నరసింహారావు 102వ జయంతి సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ఆయన సేవలను స్మరించుకున్నారు. పీవీ సేవలను, గొప్పతనాన్ని స్మరించుకుంటూ రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ఆయన జయంతి ఉత్సవాలను నిర్వహిస్తోందని తెలిపారు. 'పీవీ తెలంగాణ ఠీవీ.. క్లిష్టసమయంలో దేశాన్ని కాపాడిన ముద్దుబిడ్డ' అంటూ కేసీఆర్ కొనియాడారు. ఆయన ప్రవేశపెట్టిన ఆర్థిక సంస్కరణల ఫలాలను యావత్ దేశ ప్రజలు నేడు అనుభవిస్తున్నారని తెలిపారు. పీవీ నరసింహారావు 102వ జయంతి సందర్భంగా ఆయన సేవలను స్మరించుకుంటూ, గొప్ప రాజకీయ చతురతను, అరుదైన పాలనా నైపుణ్యాలను ప్రదర్శించడం ద్వారా ఆధునిక భారతదేశాన్ని అగ్రదేశాల ముందు తనంతట తాను నిలబడేలా మాజీ ప్రధాని పీవీ పునాది వేశారని కేసీఆర్ పేర్కొన్నారు. పీవీ నరసింహా రావు మన దేశానికి అందించిన సేవలను గౌరవించడం మన బాధ్యత. ఆయన సేవలను, గొప్పతనాన్ని స్మరించుకుంటూ రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ఆయన జయంతి ఉత్సవాలను నిర్వహిస్తోంది. పీవీ నరసింహారావు తెలంగాణకు గర్వకారణం, ఆ మహానేత నుంచి స్ఫూర్తి పొంది రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతున్నదని కేసీఆర్ అన్నారు.

పీవీకి మోదీ, ఖర్గే నివాళి

దివంగత ప్రధాని పీవీ నరసింహారావు జయంతిని పురస్కరించుకుని ప్రధాని నరేంద్ర మోదీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేలు సైతం నివాళులర్పించారు. 'పీవీ నరసింహారావు జయంతి సందర్భంగా ఆయనను స్మరించుకుంటున్నాను. ఆయన దూరదృష్టి గల నాయకత్వం, భారతదేశ అభివృద్ధి పట్ల నిబద్ధత చెప్పుకోదగినవి. దేశ పురోగతికి ఆయన చేసిన అమూల్యమైన సేవలను గౌరవిస్తున్నాం' అని ప్రధాని మోదీ ట్వీట్ చేశారు. భారతదేశ ఆర్థిక పరివర్తనకు, దేశ నిర్మాణంలో దివంగత సీనియర్ నేత చేసిన కృషి చిరస్మరణీయమని ఖర్గే ట్వీట్ చేశారు. కాగా, 28 జూన్ 1921న తెలంగాణలోని లక్నేపల్లి గ్రామంలో జన్మించిన పీవీ నరసింహా రావు... 1991-1996 వరకు ఐదేళ్ల పాటు దేశ ప్రధానిగా సేవలందించారు. ఆయన నాయకత్వంలోని అప్పటి భారత ఆర్థిక మంత్రి మన్మోహన్ సింగ్ 1991లో ఆర్థిక సంస్కరణలు తీసుకువచ్చారు. తన నిర్ణయాలను అమలు చేసే అధికారాన్ని సింగ్ కు కల్పించింది ఆయనే. 23 డిసెంబర్ 2004న తన 81వ యేట కన్నుమూశారు.

భీమ్ ఆర్మీ అధినేతపై హత్యాయత్నం?

షహరాన్‌పూర్: భీమ్ ఆర్మీ చీఫ్, ఆజాద్ సమాజ్ పార్టీ-కాన్షీరామ్ చీఫ్ చంద్రశేఖర్ ఆజాద్ బుధవారం తృటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని సహరాన్‌పూర్ జిల్లాలో ఆయన కాన్వాయ్‌పై సాయుధులు కొందరు దాడిచేశారు. కాల్పులకు దిగారు. సంఘటన వివరాల ప్రకారం, సహరాన్‌పూర్ జిల్లా దేవ్‌బంద్ ప్రాంతంలో సాయుధ దుండగులు చంద్రశేఖర్ ఆజాద్ కారుపై దాడి చేశారు. ఈ దాడులో ఆయన కారు అద్దాలు పగిలిపోయాయి. ఒక బుల్లెట్ ఆయనను తాకుతూ వెళ్లిపోయింది. కారులో వచ్చిన సాయుధులు కొందరు చంద్రశేఖర్ ఆజాద్ కాన్వాయ్‌పై కాల్పులు జరిపారని, ఒక బుల్లెట్ ఆయనను తాకుతూ వెళ్లిందని ఎస్ఎస్‌పీ డాక్టర్ విపిన్ టాడా తెలిపారు. వైద్యచికిత్స కోసం సీహెచ్‌సీకి ఆయనను తరలించామని, ప్రస్తుతం బాగానే ఉన్నారని చెప్పారు. ఈ ఘటనపై విచారణ జరుపుతున్నామని తెలిపారు.

చెరకుపై ప్రోత్సాహక ధర పెంపు

కేంద్ర కేబినెట్ నిర్ణయం

న్యూఢిల్లీ: చెరకు రైతులకు ప్రోత్సాహకరంగా కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. చెరకు పంటకు ఏటా ప్రకటించే సరసమైన, ప్రోత్సాహక ధరను ఈ సీజన్‌లో క్వింటాల్‌కు రూ.10 చొప్పున పెంచి రూ.315గా నిర్ణయించింది. ప్రధాని మోదీ అధ్యక్షతన బుధవారం జరిగిన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ తీసుకున్న ఈ తాజా నిర్ణయంతో దేశవ్యాప్తంగా ఐదుకోట్ల మంది చెరకు రైతులకు లబ్ధి చేకూరుతుందని కేంద్రమంత్రి అనురాగ్ ఠాకూర్ తెలిపారు. అక్టోబర్ నుంచి మొదలయ్యే సీజన్‌లో చక్కెర కర్మాగారాలు రైతులకు క్వింటాల్‌పై 'సరసమైన, ప్రోత్సాహకర ధర'గా రూ.315 చెల్లించాల్సి ఉంటుంది. గతేడాది ఎఫ్ఆర్‌పీ రూ.305 ఉండగా.. 2023-24 ఏడాదికిగాను క్వింటాల్‌పై రూ.315గా కేంద్రం నిర్ణయించినట్టు అనురాగ్ ఠాకూర్ తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ ఎప్పుడూ అన్నదాతలతోనే ఉంటారని.. ఈ ప్రభుత్వం వ్యవసాయానికి, రైతులకు అధిక ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి చెప్పుకొచ్చారు. అలాగే, దేశంలో పరిశోధనా సామర్థ్యాన్ని మరింతగా మెరుగుపరచడమే లక్ష్యంగా నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్ ఏర్పాటుకు సంబంధించిన బిల్లును కేంద్ర కేబినెట్ ఆమోదించింది. ఇందుకోసం పార్లమెంట్‌లో చట్టం చేయనుంది. పాలక బోర్డులో 15 నుంచి 25 మంది ప్రఖ్యాత పరిశోధకులు, అనుభవజ్ఞులను నియమించనున్నారు. ఈ బోర్డుకు ప్రధానమంత్రి నేతృత్వం వహిస్తారు. అలాగే, దేశంలో ఎరువుల వాడకాన్ని తగ్గించి ప్రత్యామ్నాయ ఎరువులు వినియోగించేలా రాష్ట్రాలను ప్రోత్సహించడమే లక్ష్యంగా 'పీఎం-ప్రాణం' అనే కొత్త పథకానికి కేంద్రం ఆమోదం తెలిపింది.

ఆగస్టు 30న విజయవాడ ముట్టడి

- 15లోగా అగ్రిగోల్డ్ సమస్య పరిష్కరించాలి
- సీఎం కంపెనీ పక్షమా? బాధితుల పక్షమా?
- ప్రభుత్వ నిర్లక్ష్యంపై ముప్పాళ్ల నాగేశ్వరరావు ఆగ్రహం

విశాలాంధ్ర-విజయవాడ (చిట్టినగర్): అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలను ఆగస్టు 15లోపు పరిష్కరించాలని, లేకపోతే అదే నెల 30న విజయవాడ నగరాన్ని ముట్టడిస్తామని అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు హెచ్చరించారు. దాసరి భవన్‌లో బుధవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. అగ్రిగోల్డ్ బాధితుల సమస్యల పరిష్కారానికి జగన్ ప్రభుత్వం ముందుకు రావడం లేదని విమర్శించారు. ఆరు మాసాల్లో అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చిన సీఎం, నాలుగేళ్లయినా వారికి న్యాయం చేయకపోవడం దారుణమన్నారు. రూ.20 వేలు డిపాజిట్ చేసిన కస్టమర్లు మూడున్నర లక్షల మంది, మరో ఆరున్నర లక్షలమంది రూ.20వేలకు పైగా డిపాజిట్‌దారులు రోజూ చచ్చి బతుకుతూ ఎదురుచూస్తున్నారన్నారు. 2021 జులై 29న ఐదుగురు అధికారులతో ప్రభుత్వం కమిటీ వేసిందని, అయినా బాధితుల సమస్యలు పరిష్కరించలేదని ముప్పాళ్ల అన్నారు. ప్రస్తుతం ఆ కమిటీ సైతం రద్దయిందన్నారు. కోర్టులో వాదన మంచిగా ఉన్నా సమస్య పరిష్కారం కాలేదని, పదేపదే వాయిదాలతో సరిపోతోందన్నారు. బాధితుల అసహజ మరణాలు 600కు చేరాయని ఆందోళన వ్యక్తం చేశారు. మృతులకు నష్టపరిహారంగా నాటి సీఎం చంద్రబాబు ఐదు లక్షలు ఇస్తుంటే, జగన్ రూ.10 లక్షలు ఇస్తానని వాగ్దానం చేశారని గుర్తు చేశారు. అధికారంలోకి రాగానే ఆ హామీ కూడా మరచిపోయారని విమర్శించారు. అసలు ముఖ్యమంత్రి కంపెనీ పక్షమా? బాధితుల పక్షమా? స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. 20 లక్షల బాధితులకు రూ.3986 కోట్లకుగాను కేవలం రూ.906 కోట్లు కేటాయించి, అంతా ఇచ్చేసినట్టు మౌనం వహించడం పచ్చి మోసం చేయడమేనన్నారు. మీట నొక్కి రూ.2.16 లక్షల కోట్లు ప్రజలకు పంచిన జగన్...అగ్రిగోల్డ్ బాధితుల కోసం బటన్ నొక్కటానికి మాత్రం ఆయనకు చేతులు రావడం లేదన్నారు. బాధితులకు ఓర్పు, సహనం నశించిందని, ఇక రోడ్డెక్కక తప్పదని ముప్పాళ్ల స్పష్టం చేశారు. స్వాతంత్ర్య దినోత్సవం రోజు ఖైదీలను విడుదల చేసి ఊరట కల్పించినట్లే... ఆగస్టు 15వ తేదీ లోపు అగ్రిగోల్డ్ బాధితులకు పూర్తి సొమ్ము ఇచ్చి ఊరట కల్పించాలని కోరారు. లేనిపక్షంలో అన్ని జిల్లాల్లో అగ్రిగోల్డ్ బాధితుల సమస్యపై రౌండ్‌టేబుల్ సమావేశాలు నిర్వహించి ఆగస్టు 30న విజయవాడ నగరాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఉద్యమ ఉధృతి వల్ల జరిగే పర్యవసానాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వీ తిరుపతిరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఎన్నికల సందర్భంగా తాను అధికారంలోకి వస్తే 6 మాసాలు దాటకుండా మొత్తం బాధితులకు పూర్తి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారన్నారు. అలాగే కంపెనీ యాజమాన్య దుర్మార్గాలను తాను చూసుకుంటానని, కోర్టులో కేసుల విషయంలో తనదే బాధ్యతని చెప్పి బాధితులను నమ్మించి మోసగించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల మేనిఫెస్టో నూరుశాతం అమలు చేసిన ఘనత తమదే అని చెప్పుకుంటున్న ముఖ్యమంత్రికి, అగ్రిగోల్డ్ బాధితులకు ఇచ్చిన హామీలు గుర్తు లేవా? అని ప్రశ్నించారు. కనీసం ఇప్పటికైనా బాధితుల ఆర్థిక ఇబ్బందులను, సమస్య తీవ్రతను అర్థం చేసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అసోసియేషన్ నేతలు షఫీ, రామాంజనేయులు, వెంకటేశ్ పాల్గొన్నారు.

రైల్వే పనులను పరిశీలించిన జగదీశ్

విశాలాంధ్ర-గుంతకల్లు: సీపీఐ పోరాటం వల్ల మల్లప్ప గేటు దగ్గర జరుగుతున్న రైల్వే బైపాస్ ట్రాక్ పనులను బుధవారం సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డీ జగదీశ్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బీ గోవిందు పరిశీలించారు. గుంతకల్ రైల్వే జంక్షన్ నుంచి వివిధ రాష్ట్రా లకు ప్రయాణించే రైళ్లు సరైన సమయానికి రాలేకపోతున్నాయని గ్రహిం చిన రైల్వే ఉన్నతాధికారులు మల్లప్ప గేటు దగ్గర సెంట్రింగ్ పాయింట్స్, రైల్వే ట్రాక్ పనులను త్వరగా చేసేందుకు శ్రీకారం చుట్టారన్నారు. ఈ పనులను పరిశీలించినట్టు వారు తెలిపారు. ఈ పరిశీలనలో సీపీఐ పట్టణ కార్యదర్శి ఎస్ గోపీనాథ్, ఏఐటీయూసీ మండల కార్యదర్శి ఈశ్వరయ్య, సీపీఐ సమితి సభ్యులు లింగమూర్తి, పృథ్వీ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోసం పీడీఎస్‌యూ ధర్నా

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: పాఠశాల విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ కార్యాలయం వద్ద పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యవర్గం అధ్వర్యంలో బుధవారం ధర్నా నిర్వహించారు. ప్రభుత్వ, ఎయిడెడ్, జిల్లా పరిషత్, మున్సిపల్ పాఠశాలల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని, పాఠశాలలు, టీచర్ పోస్టులను కుదించే 84, 85, 117 జీవోలను రద్దు చేయాలని, విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని నినదించారు. అనంతరం కమిషనర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. పీడీఎస్‌యూ జాతీయ కన్వీనర్ ఎం.రామకృష్ణ మాట్లాడుతూ కేంద్రంలో మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యారంగాన్ని మనువాద భావాజాలంతో నింపడానికి నూతన జాతీయ విద్యావిధానం తీసుకు వచ్చిందని విమర్శించారు. దేశంలో దాదాపు లక్ష పాఠశాలలు మూత పడ్డాయన్నారు. కేజీ టూ పీజీ వరకు విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు యు.గనిరాజు, రాజశేఖర్ మాట్లాడుతూ రాష్ట్రంలోజగన్ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల కారణంగా పాఠశాల విద్య అస్తవ్యస్తంగా మారిందని విమర్శించారు. పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.సునీల్, రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.అంకన్న, నాగరాజు, వైష్ణవ్, వేణు, అభిషేక్, ఆషీర్ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టు తులసి చందుపై బెదిరింపులకు ఖండన

విశాలాంధ్ర-విజయవాడ: ప్రముఖ జర్నలిస్టు తులసి చందుపై మతోన్మాద శక్తులు, కిరాయి మూకల రాతలను, బెదిరింపులను, ట్రోలింగ్‌ను వివిధ రంగాలకు చెందిన అనేకమంది ప్రముఖులు బుధవారం ఓ ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. తులసి చందు గురించి సభ్య సమాజం సిగ్గుపడేలా రాతలు రాస్తున్న దుర్మార్గుల చర్యలను ప్రజాస్వామికవాదులు గర్హించాలని పిలుపునిచ్చారు. తులసి చందుపై జరుగుతున్న ట్రోలింగ్‌ను ఖండిస్తూ ప్రకటనపై సంతకాలు చేసిన వారిలో కొత్తపల్లి రవిబాబు, దివికుమార్, జస్టిస్ చంద్రకుమార్, జస్టిస్ కేజీ శంకర్, కె.రామచంద్రమూర్తి, కె. శ్రీనివాస్, తమ్మారెడ్డి భరద్వాజ, బి.విజయ భారతి, నిఖిలేశ్వర్, కృష్ణాబాయి, శివారెడ్డి, శీలా సుభద్రాదేవి, నందిని సిధారెడ్డి, జైధీర్ తిరుమలరావు, భూపాల్‌జి, ప్రొఫెసర్ డి.నర్సింహారెడ్డి, ఏకే ప్రభాకర్, కేవీ కూర్మనాథ్, ఖాదర్ మొహియుద్దీన్, ఎన్ వేణుగోపాల్(వీక్షణం), డా.నళిని, ఎస్. కాత్యాయని, దేవిజి, కల్లూరి భాస్కరం, ప్రొఫెసర్ రామచంద్రయ్య, ప్రొఫెసర్ తోట జ్యోతిరాణి, అరసవిల్లి కృష్ణ, విరసం సూర్యసాగర్, కాత్యాయని విద్మహే, బైస దేవదాసు, నేటి నిజం తోలేటి జగన్మోహన్ రావు, చంద్రశేఖర్, యం. లక్ష్మి, కె.శోభాదేవి, బి.అరుణ(జనసాహితి), డాక్టర్ జతీన్ కుమార్, మహెజబీన్, డాక్టర్ విజయ, తరిమెల అమరనాథ్‌రెడ్డి, శివలక్ష్మి, ఏకే బాలాజీ, వర్ఘుల శివకుమార్, తాడి ప్రకాష్, డా.భట్టు లక్ష్మీనారాయణ, తమ్మినేని అక్కిరాజు, కార్టూనిస్ట్ శంకర్, ఆర్టిస్ట్ అన్వర్, కార్టూనిస్ట్ నర్సింహ, జుగాష్ విలీ, వెనిగళ్ల వెంకటరత్నం, నాళేశ్వరం శంకరం, విజయ భండారు, జనజ్వాల, ఎన్. సైదారావు, సింగంపల్లి అశోక్ కుమార్(శ్రీశ్రీ సాహిత్య నిధి), పీఎస్ నాగరాజు(ప్రజాసాహితి), పరుచూరి అజయ్ కుమార్(అరసం), సత్యాజీ (సాహితీ స్రవంతి), బోస్, రాఘవరెడ్డి, నార్నె వెంకట సుబ్బయ్య, ఈతకోట సుబ్బారావు, వి.హనుమంతరావు, సీనియర్ జర్నలిస్టు టీవీ సుబ్బయ్య, ఎస్‌ఏ రహమాన్ తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ ఉద్యోగుల సంఘ నేతకు స్వల్ప ఊరట

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ప్రభుత్వోద్యోగుల సంఘం అధ్యక్షుడు సూర్యనారాయణకు హైకోర్టులో ఊరట లభించింది. కింది కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను న్యాయస్థానం కొట్టేసింది. దీంతో ఏసీబీ కోర్టులో బెయిల్ పిటిషన్ వేసుకునేందుకు ఆయనకు స్వేచ్ఛ లభించింది. బెయిల్ అంశాన్ని జులై 7వ తేదీలోపు తేల్చాలని ఏసీబీ కోర్టుకు ధర్మాసనం ఆదేశాలు ఇచ్చింది. అలాగే వచ్చేనెల 7 వరకూ సూర్యనారాయణను అరెస్టు చేయొద్దని హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. సూర్యనారాయణ తరఫున సీనియర్ న్యాయవాది వైవీ రవిప్రసాద్ వాదనలు వినిపించారు. సూర్యనారాయణపై అవినీతి నిరోధక చట్టం కింద కేసులు నమోద య్యాయి. వాణిజ్య పన్నుల శాఖలో అక్రమాలపై కేసులో నమోదు కావడంతో ఆయన ముందస్తు బెయిల్ కోసం విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. మరోపక్క పోలీసులు అరెస్ట్ చేసేందుకు విస్తృతంగా గాలిస్తున్నారు.

21న రజక వృత్తిదారుల రాష్ట్ర సదస్సు

వాల్‌పోస్టర్ విడుదల చేసిన రామాంజనేయులు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: జులై 21న అనంతపురంలో జరిగే రజక వృత్తిదారుల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని చేతి వృత్తిదారుల సమాఖ్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామాంజనేయులు పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం విజయవాడ దాసరి భవన్‌లో వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. అనంతరం రామాంజనేయులు మాట్లాడుతూ తరతరాలుగా వృత్తి నైపుణ్యంతో సమాజానికి సేవలందిస్తున్న రజక వృత్తిదారులు చిన్నచూపుకు గురవుతూ వివక్షను, అవమానాలను, దౌర్జన్యాలను, అత్యాచారాలను ఎదుర్కొంటూ వృత్తి కొనసాగిస్తున ప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నాయని విమర్శించారు. రజకుల వృత్తిని కొనసాగించడానికి అవసరమైన దోభీ ఘాట్‌లు, నీరు, విద్యుత్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ,బట్టలు ఉతకడానికి రజకులకు కేటాయించిన భూమి కబ్జాకు గురవుతున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అడ్డుకున్న రజకులపై దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని ఆయన మండిపడ్డారు. కేంద్ర, రాష్ట్ర విభాగాల్లో దోభీ ఉద్యోగాలు, సేవలు రజకులకు అప్పగించక పోవడం దారుణమన్నారు. రజకులు సేవ చేసే ఈ రంగంలోనూ డబ్బున్న కార్పొరేట్ వ్యాపారులు ప్రవేశించి వారి ఉపాధిని దెబ్బతీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భూమి లేక శారీరక శ్రమకే పరిమితమైన రజకులు సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధికి ఆమడదూరంలో ఉన్నారన్నారు. అందుకే రజకుల వృత్తి రక్షణ, సామాజిక భద్రత, సంక్షేమమే లక్ష్యంగా పోరాటానికి సన్నద్ధం కావడానికి జులై 21న అనంతపురంలో జరిగే రజక వృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర సదస్సుకు రాష్ట్ర నలుమూలల నుండి రజకులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. రజక వృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర నాయకులు, చేతి వృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు సి.లింగమయ్య మాట్లాడుతూ రజక వృత్తిదారుల రాష్ట్ర సదస్సును మాజీ శాసనమండలి సభ్యులు పీజే చంద్రశేఖర్ రావు ప్రారంభిస్తారని, ముఖ్య అతిథిగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, వక్తలుగా అఖిల భారత మత్స్యకార్మిక సమాఖ్య అధ్యక్షుడు జేవీ సత్యనారాయణమూర్తి, చేతి వృత్తిదారుల సమాఖ్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామాంజనేయులు, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దోనేపూడి శంకర్, సామాజిక హక్కుల వేదిక రాష్ట్ర నాయకులు డి.జగదీశ్, చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జింకా చలపతి, శ్రామిక మహిళా ఫోరమ్ (ఏఐటీయూసీ) రాష్ట్ర కార్యదర్శి కళ్లేపల్లి శైలజ, సీపీఐ అనంతపురం జిల్లా కార్యదర్శి సి.జాఫర్ పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో చేతి వృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర నాయకులు టి.మాలకొండయ్య, బుద్దారపు వెంకటరావు, గొట్టుముక్కల బాలాజీ, పి.నాగాంజనేయులు, డి.రామచంద్రయ్య, ఎం.నారాయణ బాబు, ఎం.కారన్న, ఎం.రామ్మోహన్, శ్రీనివాస్, పొట్టేలు పెంటయ్య, శైలజ పాల్గొన్నారు.

గ్రీన్ ఎనర్జీలో అగ్రగామి ఐవోసీఎల్

విశాలాంధ్ర- విశాఖ సిటీ: విభిన్న తరహా ఇంధనాలను అందుబాటులోకి తీసుకు రావడం ద్వారా ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐఓసీఎల్) ఆ రంగంలో అభివృద్ధి పథంలో దూసుకెళ్తోందని ఆ సంస్థ ఎక్జిక్యూటివ్ డైరెక్టర్ బి.అనిల్ కుమార్ తెలిపారు. బుధవారం విశాఖలో నిర్వహించిన మీడియా ఇన్‌ట్రాక్షన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... ఐఓసీఎల్ తీసుకువచ్చిన ఎక్స్‌పీ 95, ఎక్స్‌పీ 100 ఇంధనాలు వాహనాలకు వివిధ ప్రయోజనాలు అందిస్తాయన్నారు. ఎక్స్‌పీ100 విజయవాడలో రెండు, వైజాగ్‌లోని ఒక అవుట్‌లెట్‌లలో అందుబాటులో ఉందన్నారు. ఎక్స్‌ట్రా తేజ్ ఇండియన్ ఆయిల్ కూడా మెరుగైన పనితీరు కనబరుస్తోందన్నారు. ఐఓసీఎల్... చమురు, గ్యాస్, పెట్రోకెమికల్స్, ప్రత్యామ్నాయ ఇంధన వనరులు సహా దాదాపు అన్నింటిలో కార్యకలాపాలు నిర్వహిస్తూ 'ఎనర్జీ ఆఫ్ ఇండియా' గా ఖ్యాతి గడించిందన్నారు. శ్రీలంక, మారిషస్, యూఏఈ తదితర దేశాలలో వ్యాపార కార్యకలాపాల నెరవేరుస్తూ... ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఫార్చ్యూన్ 500 కంపెనీల జాబితాలో 142వ స్థానంలో ఉందన్నారు. ఇండియన్ ఆయిల్ రూ.2 లక్షల కోట్ల పెట్టుబడితో 2046 నాటికి నెట్ జీరో నిర్వహణ ఉద్గారాల లక్ష్యం సాధించాలని సంకల్పించిందన్నారు. ఇండియన్ ఆయిల్ డీకార్బనైజేషన్ ప్రణాళికలు స్కోప్ 1, 2 ఉద్గారాలను కలిగి ఉంటాయని, దేశం గ్రీన్ ఎనర్జీ పరివర్తనను నడిపించడానికి కొంతకాలంగా బలమైన గ్రీన్ ఎజెండాను అనుసరిస్తోందన్నారు. తాము ఇప్పటికే గ్రీన్ హైడ్రోజన్, జీవ ఇంధనాలు, పునరుత్పాదక పదార్థాలు, పర్యావరణ వ్యవస్థ పునరుద్ధరణ ద్వారా కార్బన్ ఆఫ్‌సెట్టింగ్, కార్బన్ క్యాప్చర్ యుటిలైజేషన్ అండ్ స్టోరేజ్ (సీసీయూఎస్) వంటి అనేక ఉద్గార ఉపశమన మార్గాలపై పని చేస్తున్నామని చెప్పారు.

ఇక ఎల్‌పీజీ విభాగంలో కూడా వివిధ ఉత్పత్తులు తీసుకొచ్చామన్నారు. చోటూ 5 కేజీల మినీ వంట గ్యాస్ సిలిండర్, 2 కేజీల మున్నా గ్యాస్ సిలిండర్లు ప్రజలకు అందుబాటులో ఉండేలా తీర్చిదిద్దామని, ఎలక్ట్రికల్ వాహనాల కోసం తమ ఔట్ లెట్ లలో ఛార్జింగ్ స్టేషన్, బ్యాటరీ మార్పిడి కేంద్రాలు త్వరలో అందుబాటులోకి తీసుకురానున్నమని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఐఓసీఎల్ ప్రతినిధులు సతీష్ కుమార్, యోగా రాణి, సుబ్రాంత్, బాలసుబ్రమణ్యం, ఏకే సాహూ, మూర్తి, రవికుమార్, శ్రీనివాసన్ తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిస్టులతోనే
దోపిడీ రహిత సమాజ నిర్మాణం

జేవీ సత్యనారాయణమూర్తి స్పష్టీకరణ

విశాలాంధ్ర-విజయవాడ(చిట్టినగర్): కమ్యూనిస్టులు, వామపక్షాలతోనే దోపిడీ రహిత సమాజం నిర్మాణం సాధ్యమని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి స్పష్టం చేశారు. సీపీఐ ఎన్‌టీఆర్ జిల్లా రాజకీయ శిక్షణా తరగతులు రెండోరోజు బుధవారం ఆయన మాట్లాడారు. 'పార్టీ కార్యక్రమం' అంశంపై సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ 2014కు ముందు యూపీఏ ప్రభుత్వం అధికారంలో ఉండగా నరేంద్ర మోదీ అచ్చేదిన్ పేరుతో ప్రచారం చేసి అధికారంలోకి వచ్చారన్నారు. ఆచరణ కాని సిద్ధాంతాలతో అధికారంలోకి వచ్చి దోపిడీ రహిత సమాజాన్ని ఎలా నిర్మిస్తారని ప్రధాని మోదీని ప్రశ్నించారు. కమ్యూనిస్టులు, వామపక్షాలు మాత్రమే దోపిడీ రహిత సమాజ నిర్మాణం కోసం ఉన్నాయన్నారు. పెట్టుబడిదారీ వర్గాన్ని కూల్చితేనే, పేదరికం పోయి దోపిడీ రహిత సమాజ నిర్మాణం జరుగుతుందన్నారు. దేశంలో వాస్తవ పరిస్థితులను అంచనా వేసి కార్యక్రమం రూపొందించుకుంటుందన్నారు. దీర్ఘకాలిక లక్ష్యం కోసం వివిధ దశలలో ప్రజాస్వామ్య విప్లవం సాధించటం ద్వారా సోషలిస్టు దశలోకి విప్లవాన్ని మళ్లించాలన్నారు. దీనికోసం ఏ శక్తులను కలుపుకొని వెళ్లాలి... ఏ వ్యక్తులకు వ్యతిరేకంగా పోరాడాలి... దీనికి ఎవరు నాయకత్వం వహిస్తారు... వ్యూహాత్మక పంథా, ఎత్తుగడలు అవసరమని చెప్పారు. అంతకుముందు 'భారతదేశ చరిత్ర-సంస్కృతి' అంశంపై పార్టీ ఎడ్యుకేషన్ కమిటీ సబ్‌మెంబర్ సోమసుందర్ బోధించారు. మానవుల పుట్టుక, మార్పుల పరిణామక్రమాన్ని, దోపిడీ పద్ధతులను వివరిస్తూ... నమ్మకాలు, ఆచార వ్యవహారాలు, సంస్కృతి, సంప్రదాయాల తీరు తెన్నులపై ఉద్బోధ చేశారు. చివరగా 'జిల్లా సమగ్ర అభివృద్ధి-భవిష్యత్ కర్తవ్యాలు' అంశంపై ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి సీహెచ్ కోటేశ్వరరావు మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి నగర అధ్యక్షుడు ఎస్‌కే నజీర్, కార్యదర్శి డి.సూరిబాబు, నాయకులు లంక దుర్గారావు, కేవీ భాస్కరరావు, దాసరి రంగారావు, శర్మ, ఎస్‌కే భాష, వీరరాజు విప్లవ, అభ్యుదయ గేయాలు ఆలపించారు.

రైతులు మరోసారి ఉద్యమించాలి

- జులై23న రాష్ట్ర సదస్సు
- రైతు సంఘాల సమన్వయ సమితి కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు
- మాట తప్పిన కేంద్రం...

విశాలాంధ్ర-విజయవాడ (చిట్టినగర్): రైతువ్యతిరేక వ్యవసాయ చట్టాలను రద్దు చేసే సందర్భంలో ఇచ్చిన లిఖితపూర్వకంగా ఇచ్చిన హామీలను విస్మరించినందున కేంద్ర ప్రభుత్వ మెడలు వంచేందుకు దేశ వ్యాప్తంగా రైతులు మరో ఉద్యమం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘాల సమన్వయ సమితి కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు పేర్కొన్నారు. రైతు రక్షణకై జులై23న విజయవాడలో రాష్ట్ర సదస్సు నిర్వహించాలని పిలుపునిచ్చారు. సంయుక్త కిసాన్ మోర్చా పిలుపును అమలు జరపటానికి విజయవాడలోని దాసరి భవనంలో బుధవారం సమన్వయ సమితి రాష్ట్ర సమావేశం వడ్డేశోభనాద్రీశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యుత్ చట్ట సవరణ బిల్లు పార్లమెంటులో ప్రవేశపెట్టే ముందు రైతుసంఘాలతో సంప్రదింపులు జరుపుతామన్న కేంద్రం మాట తప్పిందన్నారు. తక్షణం విద్యుత్ చట్టసవరణ బిల్లును ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. జూన్ 7న కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరలు మోసపూరితమైనవని, మరోసారి రైతులను మోసగించిందన్నారు. డాక్టర్ స్వామినాథన్ సూచన ప్రకారం సి2ం-50శాతం కలిపి అన్ని పంటలకు మద్దతు ధరలు ప్రకటించలేదని విమర్శించారు. పెరిగిన ఉత్పత్తి ఖర్చులను పరిగణనలోకి తీసుకుని సి2ం 50కలిపి మద్దతు ధరలు ప్రకటించి దానికి చట్టబద్ధత కల్పించాలని అన్నారు. దేశంలో ప్రతి రైతు కుటుంబం రూ.2.45లక్షల అప్పుల్లో కూరుకుపోయారని వాటిని తీర్చే మార్గం లేక ఆత్మహత్యలకు పాల్పాడుతున్నారని తెలిపారు. ఒక పర్యాయం దేశవ్యాప్తంగా పంట రుణాలు మాఫీ చేయాలని, కేరళ తరహాలో రుణ ఉపసమన చట్టం తీసుకు రావాలని విజ్ఞప్తి చేశారు. జులై 23న అపరిష్కృతంగా సమస్యలపై విజయవాడలో రాష్ట్ర సదసు నిర్వహించాలని, ఈలోపు అన్ని జిల్లాల్లో జిల్లాస్థాయి సదస్సులు జరపాలని, ఆగస్టు 1 నుండి 9వరకు కేంద్ర ప్రభుత్వ విధనాలకు వ్యతిరేకంగా 'బీజేపీ హఠావో- దేశ్ బచావో' ఉద్యమాన్ని నిర్వహించాలని, ఆగస్టు15న ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఆందోళనలు జరపాలని, జులై4న పోలవరం పాదయాత్ర విజయవాడకు వచ్చే సందర్భంగా సంఘీభావం తెలపాలని సదస్సు తీర్మానించింది. ఈ సమావేశంలో 'సంయుక్త కిసాన్ మోర్చా'ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రతినిధి రాయల చంద్రశేఖర్, ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం సీనియర్ నాయకులు వై.కేశవరావు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి పి.జమలయ్య, ఆంధ్ర ప్రదేశ్ రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య, రైతుసంఘాల సమాఖ్య అధ్యక్షుడు యెర్నేని నాగేంద్రనాథ్, కాంగ్రెసు కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు జెట్టి గురునాధరావు, ప్రకాశం జిల్లా అభివృద్ధి వేదిక కన్వీనర్ చుండూరు రంగారావు, ఎఐకెఎంఎస్ రాష్ట్ర కార్యదర్శి చిట్టిపాటి వెంకటేశ్వరరావు, డెల్టా పరిరక్షణ వేదిక రాష్ట్ర నాయకులు కొలనుకొండ శివాజీ, రైతూసంఘాల సమాఖ్య నాయకులు చెరుకూరి వేణుగోపాల్, ఎఐకెఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు మర్రెడ్డి వెంకట్ రెడ్డి, ఎఐకెఎం రాష్ట్ర కార్యదర్శి డి.హరనాథ్, జాగృతి రైతుసంఘం రాష్ట్ర రాష్ట్ర నాయకులు మరీదు ప్రసాద్, ఎఐకెకెఎంఎస్ రాష్ట్ర కార్యదర్శి ఎం.గిరీష్, అఖిల భారత రైతుకూలీ సంఘం రాష్ట్ర నాయకులు వేల్పూరి నరసింహారావు, రైతు కూలీ సంఘం రాష్ట్ర నాయకులు ఎం.వీరబాబు,ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం రాష్ట్ర నాయకులు మర్రాపు సూర్యానారయణ,ఏపి రైతుకూలీ సంఘం రాష్ట్ర నాయకులు సింగోతు నాగేంద్రరావు, ఎఐకెఎస్ రాష్ట్ర నాయకులు ఎస్కే గౌస్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఆర్‌ఎంకు నేచర్ ఇండెక్స్ ర్యాంక్

విశాలాంధ్ర-మంగళగిరి: ఏపీ ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీకి ప్రతిష్టాత్మక నేచర్ ఇండెక్స్ ర్యాంకింగ్స్‌లో మూడో స్థానం లభించింది. దేశంలోని అన్ని ప్రైవేటు యూనివర్సిటీల పని తీరును విశ్లేషించిన నేచర్ ఇండెక్స్ ఏపీ ఎస్‌ఆర్‌ఎంకు 3వ ర్యాంక్‌ను ప్రకటించింది. వర్సిటీకి చెందిన ఎనిమిదిమంది ప్రొఫెసర్లు వివిధ అంశాల్లో తయారు చేసిన పరిశోధనా పత్రాలు ప్రపంచ ప్రాముఖ్యత సంతరించుకున్న జర్నల్స్‌లో ప్రచురితమయ్యాయి. అమెరికా కేంద్రంగా పని చేస్తున్న నేచర్ ఇండెక్స్ సంస్థ ప్రపంచ వ్యాప్తంగా ఉన్న వివిధ యూనివర్సిటీల పరిశోధనలు, ప్రొఫెసర్ల పరిశోధనా పత్రాలు, వాటిలోని సైంటిఫిక్ విలువలను గుర్తించి ఏటా ర్యాంకులను కేటాయిస్తుంది. ఈ ర్యాంకులను అన్ని యూనివర్సిటీలు ప్రతిష్టాత్మకంగా తీసుకుంటాయి. ఈ నేపథ్యంలో ఈసారి ఏపీ ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీకి 3వ ర్యాంక్ లభించడం విశేషం. ఆరేళ్ల కిందట స్థాపించిన ఈ యూనివర్సిటీ మల్టీ డిసిప్లినరీ రీసెర్చ్ ఇంటెన్సివ్ యూనివర్సిటీగా గుర్తింపు పొందింది. నేచర్ ఇండెక్స్ వివిధ యూనివర్సిటీల పరిశోధనా ప్రచురణలను విశ్లేషిస్తుంది. 2022 మార్చి నుంచి 2023 ఫిబ్రవరి మధ్య కాలంలో 145 ప్రఖ్యాత జర్నల్స్‌లో ప్రచురితమైన పరిశోధనా ప్రచురణలను నిశితంగా పరిశీలించింది. ఏపీ ఎస్‌ఆర్‌ఎం ప్రొఫెసర్లకు చెందిన 13 ప్రచురణలు పేరున్న సైంటిఫిక్ జర్నల్స్ ప్రచురితం అయ్యాయి. లైఫ్ సైన్సెస్, కెమికల్, ఫిజికల్, ఎర్త్ సైన్సెస్‌కు చెందిన ఈ ప్రచురణలకు ఎంతో ఆదరణ లభించింది. దీంతో నేచర్ ఇండెక్స్ ఏపీ ఎస్‌ఆర్‌ఎంకు 3వ ర్యాంక్ ప్రకటించింది. ఈ సందర్భంగా ఏపీ ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ పి. సత్యనారాయణన్ ప్రొఫెసర్లు, రీసెర్చ్ స్కాలర్లకు హృదయ పూర్వక అభినందనలు తెలిపారు. రానున్న రోజుల్లో ఏపీ ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీ పరిశోధనా సామర్థ్యాలను గణనీయంగా పెంచుకుని అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడానికి కృషి చేస్తుందని వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ మనోజ్కుమార్ అరోరా ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ప్రొఫెసర్లు, రీసెర్చ్ స్కాలర్ల కృషిని ప్రశంసించారు.

సంపాదకీయం

ఉమ్మడి పౌరస్మృతి చాటున విధ్వంసం

ఏ ఎన్నికలు వచ్చినా బీజేపీని గెలిపించడానికి ప్రధానమంత్రి మోదీకి ప్రజలను నిట్ట నిలువునా చీల్చడానికి మత సంబంధమైన వ్యవహారం ఏదో ఒకటి ఉండాలి. మరో మూడు నాలుగు నెలల్లో మధ్యప్రదేశ్ శాసనసభకు ఎన్నికలు జరగనున్నాయి. అక్కడ ఏదో ఒక సమస్యను రెచ్చగొట్టి ముస్లింల మీద ద్వేషం పెంచి ఓట్లు సంపాదించాలనుకుంటున్న మోదీ అన్ని మతాలకు వర్తించే ఉమ్మడి పౌరస్మృతి అంశాన్ని లేవనెత్తి కొత్త వివాదానికి తెర తీశారు. వాజపేయి నాయకత్వంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడినప్పుడు వివాదాస్పదమైన రామజన్మ భూమి, కశ్మీర్ కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించే 370వ అధికరణం రద్దు ఉమ్మడి పౌర స్మృతి అన్న వివాదాస్పద అంశాలను పక్కన పెట్టారు. అప్పుడు బీజేపీ ఈ విధానాన్ని అనుసరించడానికి ప్రధాన కారణం బీజేపీకి లోకసభలో సంపూర్ణమైన మెజారిటీ లేకపోవడమే. మోదీ నాయకత్వంలో బీజేపీ ఒంటరిగానే 303 స్థానాలు సాధించి సంపూర్ణమైన మెజారిటీ సంపాదించింది. రామ మందిర నిర్మాణం విషయంలో అత్యున్నత న్యాయస్థానం బీజేపీకి అనుకూలమైన తీర్పు ఇచ్చింది. 370వ అధికరణాన్ని బీజేపీ ఏకపక్షంగా రద్దు చేసింది. ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టులో విచారణ జరగవలసి ఉంది. బీజేపీ ఎజెండాలో అమలులోకి రాకుండా ఉండిపోయిన ఉమ్మడి పౌర స్మృతిని కూడా ఎలాగోలా అమలు చేసేయాలన్నది మోదీ వన్నాగం. అదేమంటే రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాలలో భాగమైన 44వ అధికరణం ప్రకారం ఉమ్మడి పౌరస్మృతి అమలులోకి తేవడానికి కృషి చేయాలని ఉంది కనక తాము ఉమ్మడి పౌరస్మృతిపై మాట్లాడడం రాజ్యాంగబద్ధమే నన్నది మోదీ, ఆయన మద్దతుదార్ల వాదన. "ఒకే కుటుంబంలో భిన్నమైన నిబంధనలు ఉంటే ఆ కుటుంబం ఎలా సమైక్యంగా ఉంటుంది? అలాంటిది భిన్న మతాలవారికి వేర్వేరు పౌరస్మృతులు ఉంటే ఎలా పొసగుతుంది" అన్నది మోదీ, బీజేపీ వాదన. ముఖ్యంగా ఇది ముమ్మారు తలాక్ లాగా ఎక్కుపెట్టిన బాణమే. పౌరులందరికీ ఒకే రకమైన హక్కులు ఉండాలిగా అని మోదీ సర్కారు ప్రశ్నిస్తోంది. ఆదేశిక సూత్రాలలో కొన్నింటిని దశలవారీగా ఇప్పటికే అమలు చేసేశాం. మరికొన్ని చేయవలసి ఉంది. రాజ్యాంగం అమలులోకి వచ్చి ఏడు దశాబ్దాలు దాటినా ఉమ్మడి పౌరస్మృతి అమలు చేయడానికి సమయం ఆసన్నం కాలేదని బీజేపీ లాంటి ఒకటి రెండు పార్టీలు మినహా మిగతా రాజకీయ పార్టీలన్నీ భావిస్తూ వచ్చాయి. అందుకే దాని జోలికెళ్లలేదు. ఉమ్మడి పౌరస్మృతి అంటే పెళ్లి, దత్తత, వారసత్వ హక్కుల్లో ఏకరూపత. దేశవాసులందరికీ ఒకే రాజ్యాంగం వర్తిస్తుంది కనక ఏ మతం వారికైనా ఒకే వివాహ చట్టం ఉండేట్టు చూడడానికి ఉన్న ఉపకరణమే ఉమ్మడి వివాహ చట్టం. ఇందులో వివాదాలకు తావు లేదు. కానీ ఏ చట్టమైనా వైవిధ్యభరితమైన భారత సంస్కృతిని దెబ్బ తీసేలా ఉండకూడదన్న భావనతోనే ఉమ్మడి పౌరస్మృతి వివాదాలకు దారి తీస్తుందనుకుని ఈ ఏడు దశాబ్దాలుగా అలాంటి చట్టం తీసుకు రాలేదు. రాజ్యాంగ ఆదేశిక సూత్రాలు మనం అనుసరించవలసిన ఆదేశాలను నిర్దేశిస్తాయే తప్ప అందులో పేర్కొన్న ప్రతి అంశాన్ని చట్ట రూపంలోకి తీసుకు రావాలని చెప్పవు. ఒక వేళ అలా చెప్పవలసిన అవసరమే ఉంటే రాజ్యాంగం రూపొందించే సమయంలోనే ఉమ్మడి పౌరస్మృతి రాజ్యాంగంలో భాగమై ఉండేది. ఆదర్శాలను అమలు చేయడానికి అనువైన వాతావరణం ఉండాలి. మత ప్రాతిపదికనగానీ మరో రకంగా కానీ ఏ వర్గం మీదా కసి తీర్చుకునే ఉద్దేశం ఉండకూడదు. మన దేశం అనేక మతాల, భాషల, సంస్కృతుల, ఆచారాల సమాహారం. ఇవి తరతరాలుగా ఆయా వర్గాలు అనుసరిస్తూ వస్తున్నవే.

ఉమ్మడి పౌరస్మృతివల్ల కొన్ని ప్రయోజనాలు లేకపోలేదు. ఉమ్మడి పౌరస్మృతి అంటే మత సంబంధమైన వైవిధ్యత, ఆచారాలతో సంబంధం లేకుండా అందరికీ ఒకే వివాహ చట్టం అమలు చేయడం. ముస్లింల మీద విద్వేష భావనవల్ల ఉమ్మడి పౌరస్మృతి కోసం వెంపర్లాడుతున్నారే తప్ప దానివల్ల కలిగే మేలు ప్రజలకు అందేలా చేయడానికి కాదు. ఈ స్మృతివల్ల స్త్రీపురుషుల మధ్య వివక్ష లేకుండా చూడవచ్చునని, జాతీయ సమైక్యత పెంపొందించవచ్చునని, అసలైన సెక్యులర్ విధానాలను అనుసరించవచ్చునని అంటున్నారు. జాతీయ సమైక్యతకు భంగం కలగడానికి కారణం ఉమ్మడి పౌరస్మృతి లేకపోవడం కాదు. సెక్యులర్ విధానాలకు ఉమ్మడి పౌరస్మృతి లేకపోవడం అడ్డంకి అవుతున్న దాఖలాలు లేవు. పురుషాధిక్యతను తగ్గించవచ్చుననీ అంటున్నారు. మహిళలకు చదువుకునే హక్కు కల్పించడం, ఆస్తిలో సమాన వాటా ఇవ్వడం లాంటి ప్రయత్నాలు ఇప్పటికే జరిగాయి. కొంత మేర సత్ఫలితాలూ ఇచ్చాయి. లోటు ఏమైనా ఉంటే దానికి కారణం ఉమ్మడి పౌరస్మృతి లేకపోవడమేననడం వితండ వాదమే అవుతుంది. రాజ్యాంగం మత స్వేచ్ఛకు పూచి పడుతోంది అంటే అన్ని మతాల వారు ఒకే రకమైన ఆచారాలు పాటించాలని బలవంత పెట్టడం కానే కాదు. ప్రతి మతం వారూ తమకు విశ్వాసం ఉన్న మతాన్ని అనుసరించవచ్చు, ప్రచారం చేయవచ్చు. అయితే బలవంత పెట్టకూడదు. ఉమ్మడి పౌరస్మృతి పేర ఒకే వివాహ, వారసత్వ, దత్తత సూత్రాలను వర్తింప చేయడంవల్ల రాజ్యాంగం ఇచ్చిన మత స్వేచ్ఛను ఉల్లంఘించినట్టే అవుతుంది. ఉమ్మడి పౌరస్మృతివల్ల ప్రయోజనాలు ఏకరువు పెట్టే వారి ప్రధాన వాదన ఏమిటంటే ముస్లింలు నాలుగేసి పెళ్లిళ్లు చేసుకోవడానికి అవకాశం ఉంటుంది కనక వారి జనాభా అమాంతం పెరిగిపోతోందని భయాందోళనలు రెచ్చగొడ్తున్నారు. నిజానికి ముస్లింలు నాలుగు పెళ్లిళ్లదాకా చేసుకోవచ్చు అనడం దానికి ఉన్న పరిమితులను, ఆకాంక్షలను తరచి చూడకపోవడమే. ఇస్లాం మతం మహిళలకు పరిమితంగానైనా సరే ఆస్తి హక్కు కల్పిస్తోంది. స్త్రీ ధనాన్ని పురుషులు ముట్టుకోకూడదు. అలాగే నాలుగేసి పెళ్లిళ్లు చేసుకోవడం హక్కు కాదు. బహుభార్యత్వం ముస్లింలకే పరిమితమైన అంశం కాదు. బహు భార్యత్వం హిందువులలోనూ ఉంది. నాలుగేసి పెళ్లిళ్లు చేసుకున్న ముస్లింలు ఎంత శాతం అని లెక్కలు తీసి చెప్పడం ఉమ్మడి పౌరస్మృతి తరఫున వకాల్తా పుచ్చుకున్నవారు ఇప్పటిదాకా చేయలేక పోయారు. ముస్లిం మహిళలకున్న ఆస్తి హక్కు హిందూ మహిళలకు ఎందుకు లేదో చెప్పరు. అల్పసంఖ్యాక మతస్థులైన ముస్లింలని దృష్టిలో ఉంచుకుని పక్షపాత దృష్టితో ఉమ్మడి పౌరస్మృతి తీసుకురావాలనుకోవడం నిజానికి మత సామరస్యాన్ని కూకటి వేళ్లతో సహా నిర్మూలిస్తుంది. భిన్న మతాల ఆచారాలను, సంప్రదాయాలను కొరగాకుండా చేస్తుంది. ఉమ్మడి పౌరస్మృతి వైవిధ్యభరితమైన సమాజం మీద రుద్దడం అంటే వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగించడమే. విద్య, ఆహారపు అలవాట్లు మొదలైన వాటి గురించే ఇతర మతాల వారి అలవాట్లను, ఆచారాలను, సంప్రదాయాలను గౌరవించకుండా విద్వేషం నింపే వాతావరణంలో ఉమ్మడి పౌర స్మృతి గొడ్డలి పెట్టులా తయారవుతుంది. మతాల మధ్యే కాదు వివిధ రాష్ట్రాల, ప్రాంతాల, సామాజిక వర్గాల మధ్య భిన్నత్వం ఉన్న దేశం మనది.

మితవాదులను ఆకట్టుకున్న మోదీ అమెరికా పర్యటన

లిజా ఫెదర్‌స్టోన్

భారత ప్రధాని నరేంద్ర మోదీ అమెరికా పర్యటనను ప్రపంచంలోనే అత్యంత మితవాదనాయకులు ఆహ్వానించారు. ప్రధాని మతమైనారిటీలను వేధించడం అమెరికా విదేశాంగశాఖను సైతం ఇబ్బందుల్లో పడవేసింది. వార్షిక మతస్వేచ్ఛ నివేదికలో ఈ సమస్యను అమెరికా విదేశాంగ శాఖ ప్రస్తావించింది. నరేంద్ర మోదీ వివక్షాపూరితమైన చట్టాలను ముస్లింలకు వ్యతిరేకంగాచేసింది. దీనివల్ల భారతదేశవ్యాప్తంగా ముస్లింలపై భయంకర మైన హింసాకాండను జరపడానికి వీలుకలిగింది. అంతేకాదు, మోదీ జర్నలిస్టులను, సామాజిక కార్యకర్తలను జైళ్లలో పెట్టారు. బీబీసీ మోదీపై విడుదల చేసిన డాక్యుమెంటరీ చిత్రం మోదీ న్యాయవ్యవస్థను సైతం అణచివేసేందుకు చేసిన ప్రయత్నాన్ని చూపించింది. 2002లో గుజరాత్‌లో ముస్లింలపై మారణకాండ జరిగినఘటనలలో మోదీ పాత్రను దృష్టిలో ఉంచుకుని అమెరికా వీసాను కూడా ఆయనకు తిరస్కరించింది. గుజరాత్ హింసాకాండలో వేయిమందికిపైగా ఊచకోత కోసారు. వీరిలో అత్యధికులు ముస్లింలే ఉన్నారు. ఇలాంటి రాజకీయాలు అమెరికాలో డొనాల్డ్ ట్రంప్ సారథ్యంలో రిపబ్లికన్ పార్టీ నిర్వహించిందని అనేకమంది ప్రజలు భావిస్తున్నారు. అనేక నేరాలకు ప్రతినిధి అయిన మోదీకి అమెరికా అధ్యక్షుడు జో బైడెన్, డెమొక్రాట్లు ఎర్రతివాచీ పరచి ఆహ్వానించడంపై ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. మోదీ మాంసం తినరు. అందుచేత కాలిఫోర్నియా నుండి చెఫ్‌ను పిలిపించి తృణధాన్యాలు, పుట్టగొడుగుల కూరలు తయారుచేయించి డిన్నర్‌లో వడ్డించారు. ఈ డిన్నర్‌కు 400మందికిపైగా అతిథులు హాజరయ్యారు. ఇందులో కాషాయ దళాలు కూడా ఉన్నాయి. బైడెన్, మోదీలు కలిసి చర్చలు జరిపిన సందర్భంగా కూడా భారతదేశంలో మోదీ పాలనలో మానవహక్కుల ఉల్లంఘన విషయాన్ని ప్రస్తావించనేలేదు. ప్రజలను తప్పుదారి పట్టించిన మోదీని బైడెన్ ప్రశంసించారు. చట్టప్రకారం సమానత్వం, భావప్రకటనా స్వేచ్ఛ, మత బహుళత్వం, ప్రజలలో వైవిధ్యం లాంటి కీలకసూత్రాలు సహనశీలతను కలిగి ఉంటాయని బైడెన్ అన్నారు. అయితే ఇవన్నీ మోదీ సాధించిన రికార్డులకు పూర్తి భిన్నంగా ఉన్నాయని వీటి అమలు నిరూపిస్తున్నాయి. అయితే ఈ కీలకసూత్రాలు రెండు దేశాల చరిత్రలో అనేక సవాళ్లను ఎదుర్కొన్నాయి, ప్రస్తుతం ఎదుర్కొంటున్నాయి. మోదీ అమెరికాలో అడుగు పెట్టకముందే ఆయనపై ఒక సానుకూలతను సృష్టించారు. వచ్చేనెలలో వాషింగ్టన్‌లో మనమిద్దరం డిన్నర్‌లో పాల్గొన్నప్పుడు ఆటోగ్రాఫ్‌ను తీసుకుంటానని బైడెన్ చెప్పాను. మీరు మా దేశానికిరావాలని ప్రతిఒక్కరూ కోరుకుంటున్నారు. ప్రభుత్వ యంత్రాంగం మోదీపై ప్రేమ చూపించడం కొత్త ఏమీకాదు. గత సంవత్సరం వేసవిలో అమెరికా రాయబార కార్యాలయం(భారత్‌లో) ఒక కార్యక్రమాన్ని నిర్వహించింది. అందులో పాల్గొన్న అమెరికా వాణిజ్య శాఖమంత్రి గినా రైమండో ప్రధాని మోదీ నమ్మశక్యంకాని గొప్ప దార్శనికుడని ఆమె ప్రశంసలు గుప్పించారు. అంతేకాదు, ప్రపంచంలో ప్రజాదరణ కలిగిన నాయకుడని భారతదేశంలో ప్రజలపై ఆయన అంకితభావం చాలా గొప్పదని కూడా ఆమె ప్రశంసించారు.

మోదీని డెమొక్రాట్లు ఎందుకుఅభిమానిస్తున్నారు? వారు ట్రంప్‌ను ద్వేషించారు. ఆయన దేశంలో మితవాదనాయకుడు. ఆయన రాజకీయాలు అనేక విధాలుగా ప్రధాని మోదీకి సమానంగా ఉంటాయి. ప్రచ్ఛన్నయుద్ధ కాలంలో చిలీ పాలకుడిగా జనరల్ అగస్తో ఫినోచెట్ మళ్లీ అధికారంలోకి రావాలనికోరుకుని సంతోషం వ్యక్తంచేసింది. ఇప్పుడు చైనాను వ్యతిరేకిస్తున్న మోదీతో భాగస్వామ్యాన్ని బైడెన్ కోరుకుంటున్నారు. రక్షణ రంగంలోనూ రెండు దేశాలు పరస్పర సహకారాన్ని కావాలని కోరు కుంటున్నాయి. నయా ఉదారవాద పెట్టుబడీదారీ విధానానికి కట్టుబడి ఉన్న మోదీని డెమొక్రాట్లు అభిమానిస్తున్నారు. కొన్ని పెద్ద కార్పొరేట్లు, కంపెనీల భాగస్వామ్యం ఉంటుందని రెండు దేశాల కంపెనీలు కూడా మోదీ సమక్షంలోనే ప్రకటించాయి. ఈ భాగస్వామ్యం జనరల్ ఎలక్ట్రిక్, హిందుస్థాన్ ఏరోనాటిక్స్‌కు మధ్య భాగస్వామ్యం ఏర్పడనున్నది. అలాగే శక్తివంతమైన ఆయుధాలను అమ్ముకునే అమెరికా కంపెనీ మైక్రాన్ భారతదేశంలో సెమి కండక్టర్ల నిర్మాణాన్ని చేపడతానని ప్రకటించింది. భారత్, అమెరికాలు ముఖ్యమైనఓటింగ్ బ్లాక్‌లో ఉంటాయి. 70 శాతం భారత్-అమెరికా ఓటర్లు 2020లో బైడెన్ కావాలని కోరుకున్నారు. ఇప్పటికీ మోదీకి అమెరికాలో ఆదరణ ఉంది. ఇక్కడ నివసిస్తున్న ఇండియన్ అమెరికన్లు అత్యంత మితవాదులు. వీరిలో ఎక్కువమంది బీజేపీని సమర్థిస్తారు. ఈ పార్టీ అత్యంత మితవాదఛాందస పార్టీ అని తెలుసు. డెమొక్రాట్లకు ఓటు వేయమని మోదీ కోరుకుంటారు. కొన్ని రాష్ట్రాల్లో ఇండియన్ అమెరికన్లు కీలకమైన ఓటర్లుగా ఉంటారు. అందువల్లే ఈ సారి మోదీకి అమెరికాలో అఖండ స్వాగతం పలికారు. తమ పార్టీకి మద్దతిస్తే ఇండియన్ అమెరికన్లను బైడెన్ సంతోషంగా ఉంచుతారు. ఈ నేపథ్యంలోనే బైడెన్, మోదీల మధ్య గొప్ప స్నేహం ఏర్పడిందని చెప్పాలి.

రైతు రక్షణ ఉద్యమాలు

కె.వి.వి.ప్రసాద్

తెలంగాణ ప్రభుత్వం తరహాలో ప్రతి రైతుకు ఎకరాకు రూ.10వేలు సాగుసహాయంగా అందించి వ్యవసాయాన్ని, రైతును కాపాడాలని పల్నాడుజిల్లా నరసరావుపేటలో ఈ నెల 13-15 తేదీలలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్రస్థాయి రైతు సమ్మేళనం డిమాండ్ చేస్తూ తీర్మానించింది. అలాగే గ్రామస్థాయి నుండి రైతు సంఘ నిర్మాణాన్ని పటిష్టం చేయాలని నిర్ణయించారు. 22 జిల్లాల నుంచి 233మంది రైతులు తమ రైతు సంఘాల ప్రతినిధులు పాల్గొని 'వ్యవసాయం-వర్తమానం-భవిష్యత్తు' అనే అంశంపై చర్చలు జరిపి నిర్ణయాలు తీసుకున్నారు. ఆయా జిల్లాల రైతు సమస్యలను, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరును మారుతున్న వ్యవసాయ పరిస్థితులు, కౌలురైతుల స్థితిగతులు, పంటమార్పిడి, వాతావరణ మార్పులు తదితర అంశాలపై రైతుసంఘ ప్రతినిధులు చర్చించారు. సమ్మేళనంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న అఖిల భారత కిసాన్‌సభ అధ్యక్షుడు రావుల వెంకయ్య ప్రసంగిస్తూ, నరేంద్ర మోదీ, రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి రైతాంగ సమస్యలను పరిష్కరించడంలో విఫలమయ్యారని విమర్శించారు. స్వేచ్ఛా వాణిజ్యంకోసం నరేంద్రమోదీ పోటీపడుతున్నారని గుజరాత్‌కు సంబంధించిన అమూల్ డైరీతో రాష్ట్ర సహకార వ్యవస్థను చిన్నాభిన్నం చేస్తున్నారని అన్నారు. ఇప్పటికే కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలు అమూల్ డైరీని ప్రతిఘటించాయని గుర్తు చేశారు. వ్యవసాయ నల్లచట్టాలకు వ్యతిరేకంగా ఢిల్లీలో ఏడాదికిపైగా రైతులు నిర్వహించిన మహత్తర ఉద్యమాన్ని మరువలేమని అన్నారు. ఉద్యమాలతోనే ప్రభుత్వాలు ప్రజావ్యతిరేక చట్టాలను ఉపసంహరించుకునేలాగా చేయగలమని రైతులు నిరూపించారు. ఈ ఉద్యమానికి బేషరతుగా మూడు నల్ల చట్టాలను మోదీ రద్దు చేశారని గుర్తు చేశారు. కేంద్ర బడ్జెట్‌లో రైతులకు ఇచ్చే సబ్సిడీపై కోత విధించి వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేస్తున్నారని తెలిపారు. ధరల స్థిరీకరణ నిధులు తగ్గించి మద్దతు ఇవ్వడంలో సవతి తల్లిప్రేమ చూపిస్తున్నారన్నారు. ఆచార్య ఎన్‌జి రంగ విశ్వవిద్యాలయం రిటైర్డ్ డైరెక్టర్ ఆలపాటి సత్యనారాయణ మాట్లాడుతూ, మారిన వాతావరణ పరిస్థితుల్లో ఏ పంటలు వేసుకోవాలో రైతులకు అర్థం కావడంలేదన్నారు. భూమిలో సేంద్రియ కర్బన శాతాన్ని పెంచాలని సూచించారు. శ్రీవరి రకం విత్తనం సాగుచేపట్టడం ద్వారా ఉత్పత్తి పెంచుకునే అవకాశం ఉందని ఆయన తెలిపారు. అధిక దిగుబడులువచ్చే పంటలను పండించడం ద్వారా రైతులు ఆత్మహత్యలకు పాల్పడకుండా నివారించవచ్చునని అన్నారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి, రైతుసంఘ నాయకులు ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ, రైతుల ఆదాయం రెట్టింపు చేస్తానన్న మోదీ హామీ అమలుకు నోచుకోలేదని అన్నారు. ఆర్‌బీకేలు రైతులకు అండగా ఉంటాయని పాలకులు ఊదరగొడుతున్నారేకానీ, ఆచరణలో విఫలమయ్యారని తెలిపారు. నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందించడంలేదని అన్నారు. ఆర్‌బీకేలలో సిబ్బంది లేరనికూడా విమర్శించారు. చిన్న, సన్నకారు రైతులకు రుణాలు ఇవ్వడంలేదని, జన్‌ధన్ ఖాతాలు పెరిగినా కౌలు రైతులకు రుణాలు అందడంలేదని తెలిపారు. రాష్ట్రంలో 66.24 లక్షల కుటుంబాలు వ్యవసాయ రంగంలో ఉండగా,

అందులో 16లక్షల కుటుంబాలు కౌలు రైతులేనని తెలిపారు. యువ రైతులు, మహిళా రైతులను వ్యవసాయ రంగంలో నిలబెట్టేందుకు ప్రభుత్వాలు కార్యాచరణ రూపొందించాలన్నారు. నరసరావుపేట తెలుగుదేశం ఇన్‌ఛార్జి అరవింద్‌బాబు మాట్లాడుతూ రైతుల కన్నీళ్లు తుడిచేది రైతు సంఘం, కమ్యూనిస్టు పార్టీలేనని అన్నారు. మహారాష్ట్రకు చెందిన రైతుసంఘ ప్రధాన కార్యదర్శి దేవెగౌడ, అనంతపురం రైతుల కోటన్న, ప్రకాశంజిల్లా రైతులు కొట్టూరి పేరయ్య, నల్లూరి చంద్రశేఖర్‌తోపాటు రాష్ట్రంలో అప్పుల బాధతో మృతిచెందిన రైతులకు, ఒడిశాలో రైలు ప్రమాద మృతులకు, కర్నూలు జిల్లా రైతు సంఘ ప్రధాన కార్యదర్శి కె.జగన్నాథం సంతాప తీర్మానం ప్రవేశపెట్టగా సభ రెండు నిమిషాలు మౌనం పాటించింది. రాజ్యసభ మాజీ సభ్యులు ఎన్ తులసిరెడ్డి మాట్లాడుతూ గోదావరి-కృష్ణ-పెన్నా నదుల అనుసంధానం ఎంతో అవసరమని ఇది విస్మరిస్తే రాష్ట్రం ఎడారిగా మారుతుందని హెచ్చరించారు. మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావు ప్రసంగిస్తూ వైసీపీ ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులను నిర్లక్ష్యంచేస్తూ సంక్షేమం పేరుతో ప్రజలను మోసగిస్తున్నదని, వ్యవసాయరంగాన్ని పూర్తిగా విమర్శించారు.

చివరిరోజు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, రైతుసంఘ పూర్వ అధ్యక్షుడు కె.రామకృష్ణ మాట్లాడుతూ, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న రైతు వ్యతిరేక విధానాలపై ప్రతిపక్షపార్టీలు, ప్రజాసంఘాలు,రైతు సంఘాలు కలిసి ఉద్యమం నిర్వహించాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలతో రాయలసీమలో పరిస్థితులు దిగజారాయని తెలిపారు. అసమర్థపాలన ఫలితంగా నాలుగేళ్లలో రాష్ట్రంలో ఒక్క ప్రాజెక్టు కూడా నిర్మాణం పూర్తికాలేదన్నారు. ప్రాజెక్టుల సాధనకోసం రైతు సంఘాలు, రాజకీయ పార్టీలు ఏకమై ఐక్యంగా ఉద్యమాలు చేపట్టాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ట్రు అప్ ఛార్జీలు, సర్‌చార్జీల పేరుతో విద్యుత్ వినియోగదారులపై భారీగా భారం మోపిందని అన్నారు. అదాని కంపెనీలకు దోచి పెట్టేందుకుగాను స్మార్ట్ మీటర్లను బలవంతంగా ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం పూనుకున్నదని తెలిపారు. చత్తీస్‌ఘడ్, రాజస్థాన్ రాష్ట్రాల్లో స్మార్ట్ మీటర్లు రూ.9100, రూ.9900 ఖరీదు ఉండగా, ఆంధ్రప్రదేశ్‌లో రూ.36,950కి స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రాల మధ్య ఇంత తేడా మొత్తాన్ని చూపడంద్వారా లక్షల కోట్లు ప్రభుత్వం దోచుకుంటున్నదని ఆరోపించారు. ప్రభుత్వ విధానాలపై ఉద్యమాలకు సిద్ధం కావాలన్నారు. ఇరిగేషన్ శాఖ రిటైర్డ్ ఎస్‌ఈ కంభంపాటి పాపారావు మాట్లాడుతూ రాష్ట్రంలో 60శాతం ప్రజలు వ్యవసాయంపై జీవిస్తున్నారని, నీటి వనరులు సమృద్ధిగా ఉన్నా సాగునీటిని అందించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పి.రామచంద్రయ్య మాట్లాడుతూ, రాష్ట్రంలో నిలిచిపోయిన ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తిచేయాలని, ఇందుకు ప్రభుత్వాలపై వత్తిడి తెచ్చేందుకు రైతులు ఉద్యమాలకు సిద్ధం కావాలని కోరారు. రాష్ట్ర రైతుసంఘం ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర రెడ్డి మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు విషయంలో కేంద్ర ప్రభుత్వం దోబూచులాడుతోందని విమర్శించారు. నల్లమల రైతుసంఘం అధ్యక్షుడు డాక్టర్ కొల్లా రాజమోహన్ మాట్లాడుతూ నల్లమడ, గుంటూరు ఛానల్ ఆయకట్టు పరిధిలో సాగునీటికోసం తాము చేసిన ఉద్యమాలను వివరించారు. సదస్సులో రైతుల స్వరాజ్య వేదిక నాయకులు దుర్గాప్రసాద్, ఏఐటీయూసి రాష్ట్ర గౌరవ అధ్యక్షులు రాధాకృష్ణ మూర్తి ప్రసంగించారు.

సమ్మేళనం ప్రారంభం సందర్భంగా రైతు సంఘ సీనియర్ నాయకులు వై సూర్యనారాయణ రెడ్డి జెండాను ఆవిష్కరించారు. పల్నాడు జిల్లా ప్రజానాట్య మండలి కళాకారులు రైతుల గేయాలని ఆలపించి రైతాంగాన్ని ఉత్సాహ పరచారు. ఆహ్వాన సంఘ అధ్యక్షులు నాగోతు సౌరయ్య, ఆహ్వాన సంఘ గౌరవ అధ్యక్షులు సీజ ప్రతాప్ ప్రసంగించారు. సదస్సులో వివిధ రైతు సంఘాల నాయకులు, ఏఐటీయూసీ నాయకులు, సీపీఐ నాయకులు, రైతులు పాల్గొని సమ్మేళనాలను విజయవంతంచేశారు. సమ్మేళనం జరిగిన ఎస్‌ఎస్‌ఎన్ కాలేజి యాజమాన్యం, సిబ్బంది అందించిన సహకారం శ్లాఘనీయం. 2023 జూన్ 20నుంచి 30వ తేదీ వరకు రాష్ట్ర సమితి తీసుకున్న నిర్ణయాల అమలుకు జిల్లా స్థాయి సన్నాహక సమావేశాలు నిర్వహించి భవిష్యత్తు కార్యక్రమానికి నిర్దిష్ట ప్రణాళిక రూపొందించి నిర్ణయించారు.

ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం ప్రధాన కార్యదర్శి

వన్నె కోల్పోతున్న వైద్య వృత్తి

ప్రాణం పోసేవాడు దేవుడైతే, ప్రాణం నిలిపేవాడు వైద్యుడు అంటారు. సమాజంలో వైద్యుడికి అపారమైన ఆదరణ, గౌరవం ఉంది. వైద్యుడంటే ఒక నమ్మకం.. ఒక భరోసా.. ఒక గురి.. తమ ప్రాణాలను వైద్యుడి చేతిలో పెట్టి నిశ్చింతగా ఊపిరి పీల్చుకుంటారు ప్రజలు. విధి నిర్వహణలో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటూ, వ్యక్తిగతంగా, కుటుంబ పరంగా ఎన్నో త్యాగాలు చేస్తాడు వైద్యుడు. లోపల ఎన్ని బాధలున్నా పైకి మాత్రం చిరునవ్వులు చిందిస్తూ, నగుమోముతోనే సగం జబ్బు తగ్గించేస్తాడు. మానవీయ స్పందనలు లేనివారు వైద్యవృత్తికి పనికిరారు. జబ్బుతో వచ్చిన రోగిని ప్రేమించలేని వైద్యుడు కూడా రోగితో సమానమే. వైద్యునికి అంకితభావం, బాధ్యతా భావం, చిత్తశుద్ధి అనేవి తప్పనిసరిగా ఉండవలసిన లక్షణాలు. ఒకప్పుడు కుటుంబ వైద్యులు ఉండేవారు. ఎంతో ఆత్మీయంగా కుటుంబ సభ్యులతో కలిసిపొయ్యేవారు. కుటుంబంలో ఎవరికి ఏసమస్య వచ్చినా నిస్సంకోచంగా, ఎలాంటి అరమరికల్లేకుండా వారితో చెప్పుకునేవారు. వైద్యుడంటే, ఏదో ప్రత్యేక వ్యక్తిగా కాకుండా ఒక స్నేహితుడిగా ఉండేవాడు. అప్పటి వారు తమకున్న పరిమితమైన పరిజ్ఞానంతో, ప్రత్యేక నైపుణ్యంతో రోగి నాడిని పసిగట్టి వైద్యం చేసేవారు. ఆరోజుల్లో ఇన్ని మందులు కూడా వుండేవికావు. వ్యాధి కారణాలను కనిపెట్టే సాధనాలు కూడా వారికి అందుబాటులో లేవు. నాటి ప్రజలు వైద్యుణ్ని నమ్మకమైన స్నేహితుడిగా, ఆత్మీయుడిగా, మార్గదర్శిగా విశ్వసించేవారు. వైద్యుడు కూడా వారి నమ్మకానికి అనుగుణంగా కుటుంబ శ్రేయోభిలాషిగా మసలుకునేవాడు. కాని ఈనాడు కుటుంబ వైద్యుడు అనే ఆలోచన పూర్తిగా మాయమైంది.

డాక్టరు తన వృత్తిని వ్యాపారంగా, రోగిని కొనుగోలుదారుడుగా భావించే పరిస్థితి ఏర్పడింది. వైద్యం కార్పొరేటీకరణ దిశగా పరుగులు పెడుతున్న నేటి దశలో సంపాదనకు అది పర్యాయపదంగా మారి పోయింది. రోగి అంటే డబ్బు సృష్టించే ఓ యంత్రం అన్న భావన ఏర్పడింది. ప్రజారంగంలో ఆరోగ్య సేవలు, సదుపాయాలు క్రమంగా దిగజారిపోయాయి. ప్రజారోగ్యానికి వెన్నెముకలుగా, వెన్నుదన్నుగా నిలబడాల్సిన, పేద ప్రజల అవసరాలు తీర్చాల్సిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు సరిగా పనిచేయడం లేదు. అందులో కావలసిన పరికరాలు సరిగా వుండడంలేదు. పనిచేసే వైద్యులు, సిబ్బంది కూడా అంతంత మాత్రమే. మందులు కూడా సరిగా ఉండవు. ఉన్నాఅవి ప్రజలకు ఉపయోగపడవు. మంచి సదుపాయాలుండాల్సిన ఆసుపత్రులలో బోధనా సిబ్బంది, తగినంతమంది ఉద్యోగులు లేక, ఉన్నా, వారిలో అంకితభావం లేక వెనుకబడి వున్నాయి. ప్రజారోగ్యం పట్ల పాలకుల నిర్లక్ష్యం, ఉదాసీనత దీనికి కారణం. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజలు అనివార్యంగా ప్రైవేటు వైద్యులను ఆశ్రయించక తప్పని పరిస్థితి ఏర్పడుతోంది. ఈ నేపథ్యంలో క్రమంగా వైద్యం ప్రైవేటు పరం అయిపోయి వ్యాపారీకరణకు దారితీసింది. ప్రైవేటు మెడికల్ కాలేజీలు, మల్టీస్పెషాలిటీ వైద్యశాలలు పుట్టగొడుగుల్లా పెరిగి, అన్ని రకాల అవినీతి పద్ధతులకు పాల్పడు తున్నాయి. విద్యార్థులు, వినియోగదారుల నుండి అంతులేని డొనేషన్లు, ఫీజులు వసూలు చేస్తున్నాయి. డొనేషన్లు వసూలు చేయకూడదని చెప్పిన సుప్రీం ధర్మాసనం ఆదేశాన్నీ ఎవరూ పట్టించుకోవడం లేదు.

గత కొన్ని సంవత్సరాలుగా కార్పొరేట్ ఆసుపత్రులు పచ్చి వ్యాపార సంస్కృతికి తెరతీశాయి. పత్రికల్లో, ఎలక్ట్రానిక్ మీడియాలో పెద్ద ఎత్తున ప్రకటనలు గుప్పిస్తున్నాయి. పీఆర్ఓ లను పెట్టుకుని తమ ఆసుపత్రికి కేసులు పంపిన డాక్టర్లకు ఆకర్షణీయమైన ప్రతిఫలాన్ని ఆశచూపిస్తున్నాయి. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించుకోవడానికి దొడ్డిదారుల్ని ఆశ్రయిస్తున్నారు. ఈ దొడ్డిదారులు చాలా వికృతమైన రూపాలు ధరిస్తున్నాయి. అవసరానికి మించి ఎక్కువ ఖరీదైన మందులు రాయడం, అవసరం ఉన్నా లేకపోయినా రకరకాల పరీక్షలు చేయించడం, అవసరంలేని ఆపరేషన్లు చేయడం, ప్రతి రెండో కేసునీ ఐసీయూలో పెట్టడం, వెంటిలేటర్ ఎక్కించడం లాంటి రోగుల జేబులు ఖాళీ చేయించే విధానాలు అవలంబిస్తున్నారు. దీంతో సమాజంలోని అన్నిరంగాలకు భిన్నంగా ఉంటుందని ఆశించే వైద్యరంగం కూడా అవినీతి ఊబిలో పీకలదాకా కూరుకు పోయింది. దీనికి తగినట్లుగానే ఔషధ పరిశ్రమలు విపరీతంగా పెరిగి పోయాయి. ఒక్క మనదేశంలోనే 17,000 పైచిలుకు ఔషధ కంపెనీలు, 40,000 పైగా ఔషధ రకాలను ఉత్పత్తి చేస్తున్నాయి. కొన్ని కంపెనీలు వాటిని మార్కెటింగ్ చేయటానికి రకరకాలమార్గాలు అవలంబిస్తున్నాయి. వైద్యులకు ఖరీదైన నజరానాలు సమర్పించడం, విందులు వినోదాల్లో ముంచడం, విదేశీ టూర్లు వేయించడం, మరికొన్ని ఇతర కోరికలు, అవసరాలు తీర్చడం లాంటి నీచపు పనులన్నీ చేస్తుంటాయి. ఈ నేపథ్యంలో సాధారణ ప్రజల్లో వైద్యులు, వైద్యవృత్తి సందేహాస్పదంగా మారిపోయింది.

వైద్యరంగంలో అత్యున్నత మానవీయవిలువలు పాటించేవారు ఈనాటికీ అనేకమంది ఉన్నప్పటికీ, కొందరివల్ల అందరికీ, మొత్తం వైద్యవ్యవస్థకే చెడ్డపేరు వస్తోంది. అందుకని, వైద్యులు తమ వృత్తి ధర్మాన్ని అత్యున్నతస్థాయిలో నిర్వహించాలి. తన వద్దకు వచ్చిన రోగి పట్ల నిజాయితీగా వుండాలి. నిబద్ధతతో వ్యవహరించాలి. రోగిని చూసేపద్ధతి స్నేహపూరితంగా, దయగా, వితరణతో కూడినదై వుండాలి. బంధువులకు, రోగి దగ్గర వుండే వారికి వాస్తవ పరిస్థితిని వివరించి ధైర్యం చెప్పాలి. వైద్య వ్యవస్థ మీకు అండగా ఉందన్న భరోసా కల్పించాలి. వైద్యవృత్తిని అమితంగా ప్రేమించి, శ్వాసించిన డాక్టర్ బిదాన్ చంద్రరాయ్ (బీసీ రాయ్)ను ఆదర్శంగా తీసుకొని వృత్తిధర్మాన్ని నిజాయితీగా, నిస్వార్థ ప్రజా సేవకు నడుంబిగించాలి. ప్రజల నిత్యజీవితంలో కీలకపాత్ర పోషించే వైద్యుల సేవలను గుర్తించి, వారి గొప్పతనంపట్ల అవగాహన పెంచడం కోసం డా.బీసీ రాయ్ జయంతి, వర్ధంతి రోజు జులై 1 వ తేదీని 'జాతీయ వైద్యుల దినోత్సవం' గా నిర్వహించడాన్ని వైద్య మహోదయులు గౌరవంగా, స్ఫూర్తిగా తీసుకొని ప్రజాసేవకు పునరంకితం కావాలి. కొంతమందివల్ల మొత్తం వైద్య వ్యవస్థకే వస్తున్న చెడ్డపేరును తొలగించ దానికి చిత్తశుద్ధితో కూడిన ప్రయత్నం చెయ్యాలి. తమలో ఏవైనా లోటుపాట్లు ఉంటే గనక వాటిని సరిదిద్దుకొనే ప్రయత్నం చేయగలిగితే ప్రజల నమ్మకాన్ని, ప్రేమాభిమానాలను మరలా తిరిగి పొందడం అసాధ్యమేమీకాదు. ఏది ఏమైనా వైద్యులు గౌరవనీయులు, త్యాగధనులు, ప్రేమమూర్తులు. వ్యాపార దృక్పథాన్ని కాసేపు పక్కనబెట్టి, వారుతమ వ్యక్తిగత జీవితాన్ని త్యాగంచేసి ప్రజలకు సేవ చేస్తున్నందుకు మనమంతా వారిని మనసారా అభినందిద్దాం. వారి సేవలను స్మరించుకుందాం. ఏమంటారు?

యండి.ఉస్మాన్ ఖాన్, సీనియర్ జర్నలిస్టు

యూసీసీని అంగీకరించం

అత్యవసర భేటీలో ముస్లిం లా బోర్డు నిర్ణయం

న్యూఢిల్లీ: దేశంలో ఉమ్మడి పౌర స్మృతిపై చర్చ ఊపందుకుంటోంది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ భోపాల్ నుంచి దీనిపై మాట్లాడటంతో... ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డ్ మంగళవారం అర్ధరాత్రి అత్యవసరంగా సమావేశమైంది. యూసీసీ వల్ల ఎదురయ్యే చట్టపరమైన అంశాల గురించి చర్చించింది. దీనిని వ్యతిరేకిస్తూ శాసన పరిశీలన సంఘం సమక్షంలో వాదనలు వినిపించాలని నిర్ణయించింది. రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలిసి, తమ వాదనను వినిపించాలని నిర్ణయించింది. మోదీ యూసీసీ ప్రతిపాదనపై కాంగ్రెస్, డీఎంకే, ఏఐఎంఐఎం ఘాటుగా స్పందించాయి. ఈ క్రమంలోనే ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు సమావేశం వర్చువల్ విధానంలో జరిగింది. దాదాపు మూడు గంటలపాటు జరిగిన ఈ సమావేశంలో యూసీసీని వ్యతిరేకించాలని నిర్ణయించారు. బీజేపీ

మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో ఒకటైన యూసీసీపై తమ వాదనను, న్యాయవాదులు, నిపుణులు వ్యక్తం చేసిన అభిప్రాయాలను లా కమిషన్‌కు సమర్పించాలని నిర్ణయించారు. వివాహం, విడాకులు, వారసత్వం, పిల్లల దత్తత వంటి అంశాల్లో దేశ ప్రజలందరికీ సమాన హక్కులు, నిబంధనలు అమల్లో ఉండాలని బీజేపీ చెబుతోంది. ఇప్పటి వరకు వేర్వేరు మతస్థుల కోసం వేర్వేరు చట్టాలు అమలవుతున్నాయి. దేశవ్యాప్తంగా ఉమ్మడి పౌర స్మృతిని అమలు చేయడానికి ప్రయత్నించాలని భారత రాజ్యాంగంలోని అధికరణ 44 చెప్తోంది. యూసీసీపై అభిప్రాయాలను తెలపాలని లా కమిషన్ ఇటీవలే ఓ నోటిఫికేషన్ ఇచ్చింది. మత సంస్థలు, వ్యక్తులు తమ అభిప్రాయాలు తెలియజేయవచ్చునని తెలిపింది.

ఏకాభిప్రాయం కావాలి: ఆప్

దేశంలో ఉమ్మడి పౌర స్మృతిపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేసిన వ్యాఖ్యలతో రాజకీయపార్టీలు విస్తృతమైన చర్చలు మొదలుపెట్టాయి. యూసీసీకి ఆమ్ ఆద్మీ పార్టీ లాంఛనంగా మద్దతు ప్రకటించింది. అయితే, దీనిపై అన్ని మతాలు, రాజకీయ పార్టీలు, సంస్థలతో విస్తృత చర్చలు జరపాలని పేర్కొంది. దేశవ్యాప్తంగా ఉమ్మడి పౌర స్మృతిని అమలు చేయడానికి ప్రయత్నించాలని భారత రాజ్యాంగంలోని అధికరణ 44 చెబుతోంది. దీనితో మేము ఏకీభవిస్తున్నాం. అయితే, అన్ని మతాలు, రాజకీయ పార్టీలు, సంస్థలతో విస్తృతంగా సంప్రదింపులు జరిపి ఏకాభిప్రాయం తీసుకురావాని ఆప్ నేత సందీప్ పట్నాయక్ ఒక ట్వీట్‌లో తెలిపారు. దేశంలోని అనేక సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు యూసీసీ చర్చను ప్రధాని లేవనెత్తారని కాంగ్రెస్, డీఎంకే, మజ్లిస్ పార్టీలు మండిపడ్డాయి. యూసీసీని వ్యతిరేకించాలని ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు సమావేశంలో కూడా నిర్ణయం తీసుకున్నారు.

శస్త్రచికిత్సల సమయంలో హిజాబ్ ఉండాల్సిందే

ముస్లిం విద్యార్థినుల డిమాండ్

తిరువనంతపురం : శస్త్ర చికిత్సలు చేసే సమయంలో తమ మతాచారాలను పాటించేందుకు అవకాశం కల్పించాలని ఏడుగురు ముస్లిం విద్యార్థినులు కేరళలోని ఓ ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌కు లేఖ రాశారు. తమ మత విశ్వాసాల ప్రకారం హిజాబ్‌ను అన్ని సందర్భాల్లోనూ ధరించడం తప్పనిసరి అని తెలిపారు. ఆసుపత్రి, శస్త్ర చికిత్సల గదులలో పాటించవలసిన నిబంధనలను అనుసరిస్తూ, తమ మతాచారాలను పాటించడం తమకు కష్టంగా ఉందన్నారు. విదేశాల్లో మాదిరి తమకూ ప్రత్యామ్నాయ దుస్తులను అనుమతించాలని డిమాండ్ చేశారు. ఎంబీబీఎస్ చదువుతున్న ఈ విద్యార్థినులు రాసిన లేఖలో, విదేశాల్లో లాంగ్ స్లీవ్ స్క్రబ్ జాకెట్లు, సర్జికల్ హుడ్స్ అందుబాటులో ఉంటున్నాయని తెలిపారు. వీటివల్ల తాము హిజాబ్ ధరించడానికి, అదే సమయంలో స్టైరైల్ ప్రికాషన్స్ తీసుకోవడానికి తమకు అవకాశం ఉంటుందన్నారు. ఈ నేపథ్యంలో తిరువనంతపురం ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లైనెట్ మోరిస్ మాట్లాడుతూ, విద్యార్థినుల డిమాండ్‌పై చర్చించేందుకు ఓ కమిటీని ఏర్పాటు చేశామన్నారు. ఈ డిమాండ్‌ను ఇప్పటికిప్పుడు ఆమోదించడం సాధ్యం కాదన్నారు. ఆపరేషన్ థియేటర్లలో అంతర్జాతీయ ప్రమాణాలను పాటిస్తున్నామని చెప్పారు. రోగుల భద్రతకు పెద్ద పీట వేస్తున్నట్లు తెలిపారు. తాను ఒక్కడినే దీనిపై నిర్ణయం తీసుకోవడం సాధ్యం కాదన్నారు. తాము ఏర్పాటు చేసిన కమిటీ 10 రోజుల్లోగా ఓ పరిష్కారాన్ని సూచిస్తుందన్నారు.

వెర్సోవా-బాంద్రా సీలింక్‌కు సావర్కర్ పేరు: షిండే

ముంబై: మహారాష్ట్రలోని ఏక్‌నాథ్ షిండే ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వెర్సోవా- బాంద్రా సీలింక్‌కు వీడీ సావర్కర్ సేతుగా నామకరణం చేసింది. అలాగే, ముంబై ట్రాన్స్ హార్బర్ లింక్‌కు మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయీ పేరును ఖరారు చేసింది. ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈ నిర్ణయాలు తీసుకున్నారు. అయితే ఈ పేరు మార్పు నిర్ణయాలను గల నెలోనే ప్రకటించారు. తీర ప్రాంతంలో 17కి.మీల మేర నిర్మిస్తున్న వెర్సోవా-బాంద్రా సీ లింక్.. అంధేరీని బాంద్రా-వర్లి సీ లింక్‌తో అనుసంధానం చేయనుంది. అలాగే, నవీ ముంబైని ముంబైకి అనుసంధానం చేసే ముంబై ట్రాన్స్ హార్బర్ లింక్ నిర్మాణం ఈ ఏడాది డిసెంబర్ నాటికి పూర్తి కానుంది. దీంతో పాటు రాష్ట్రంలో అమలు చేస్తున్న మహాత్మా జ్యోతిరావ్ ఫూలే జన్ ఆరోగ్య యోజన పథకం పరిధిని రూ.2లక్షల నుంచి రూ.5లక్షలకు పెంచడంతో పాటు రాష్ట్రంలోని ప్రజలందరికీ అందజేయాలని నిర్ణయించినట్టు సీఎం షిండే తెలిపారు.

సిద్ధరామయ్య భయపడ్డారు: డీకే

బెంగళూరు: కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను ఉద్దేశించి ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. గతంలో సిద్ధరామయ్య సీఎంగా ఉన్న సమయంలో ఓ ప్రాజెక్ట్ గురించి ఆయన భయపడ్డారని వ్యాఖ్యానించారు. దీంతో ఇది కాస్తా రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశమైంది. కాగా, సిద్ధూ-డీకే బంధం బీటలు వారుతుందనే ఊహాగానాలు జోరందుకున్నాయి. బెంగళూరు నగర నిర్మాత కెంపేగౌడ జయంతి సందర్భంగా విధానసౌధ ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో డీకే శివకుమార్ ప్రసంగించారు. 'టన్నెల్స్, ఫ్లైఓవర్లు నిర్మించాలని చాలామంది నుంచి అభ్యర్థనలు వస్తున్నాయి. అయితే అలాంటి ప్రాజెక్టుల నిర్మాణానికి చాలా సవాళ్లు ఎదురవుతాయి. 2017లో ఇలాగే బెంగళూరులో స్టీల్ ఫ్లైఓవర్ నిర్మించాలని అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం తలపెట్టింది. అయితే దానికి పెద్ద ఎత్తున వ్యతిరేకత ఎదురైంది. అప్పటి సీఎం సిద్ధరామయ్య, బెంగళూరు నగర అభివృద్ధి శాఖ మంత్రి కేజే జార్జ్ ఆందోళనలకు భయపడ్డారు. అదే నేనైతే.. అలాంటి నిరసనలకు తలొగ్గేవాణ్ని కాదు. ప్రాజెక్టు నిర్మాణానికే ముందుకెళ్లేవాణ్ని" అని డీకే వ్యాఖ్యానించారు. కర్ణాటకలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నెల రోజులకే డీకే నుంచి ఇలాంటి వ్యాఖ్యలు రావడం.. రాష్ట్ర రాజకీయాల్లో కొత్త వివాదానికి తెరలేపింది. సిద్ధూతో డీకేకు పొసగడం లేదంటూ వదంతులు గుప్పుమన్నాయి. అయితే, శివకుమార్ వ్యాఖ్యలపై రాష్ట్ర మంత్రి ప్రియాంక్ ఖర్గే స్పందించారు. 'సిద్ధరామయ్య భయపడ్డారని నేను చెప్పను.

ప్రజల అభిప్రాయాలతో సీఎం సున్నితంగా వ్యవహరించాల్సి ఉంటుంది. కొన్నిసార్లు తప్పుడు కథనాలు ప్రచారంలోకి వచ్చి మంచి నిర్ణయాలు తీసుకోవడం ఆలస్యమవుతుంటుంది. ఉపముఖ్యమంత్రి ఆ ఉద్దేశంతోనే చెప్పారేమో" అని అన్నారు. ఇటీవల కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం తర్వాత ముఖ్యమంత్రి పదవికి సిద్ధూ, డీకే మధ్య తీవ్ర పోటీ నెలకొన్న విషయం తెలిసిందే. చివరకు డీకే హైకమాండ్ నిర్ణయానికి తలొగ్గి సీఎం రేసు నుంచి వైదొలిగారు. దీంతో సిద్ధరామయ్య రెండోసారి ముఖ్యమంత్రి పదవి చేపట్టారు. ఆ తర్వాత నుంచి వీరిద్దరూ ఐక్యంగానే ప్రభుత్వాన్ని నడుపుతున్నా.. ప్రతిపక్ష బీజేపీ మాత్రం వీరిపై విమర్శలు చేస్తూనే ఉంది. ఈ ప్రభుత్వం ఎంతోకాలం నిలవదని కాషాయ నేతలు జోస్యం చెబుతున్నారు.

ఉచిత బియ్యానికి బదులుగా నగదు

కర్నాటక ప్రభుత్వం నిర్ణయం

బెంగళూరు: కర్నాటక అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ఇచ్చిన ఐదు హామీల్లో ఒకటైన అన్నభాగ్య పథకం అమలుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ పథకాన్ని జులై 1 నుంచి అమల్లోకి తీసుకురావాల్సి ఉండగా... అందుకు అవసరమైన బియ్యం సేకరణ సాధ్యం కావట్లేదు. దీంతో సిద్ధరామయ్య సర్కారు కీలక నిర్ణయం తీసుకుంది. ఉచిత బియ్యానికి బదులుగా నగదు ఇస్తామని ప్రకటించింది. కిలో బియ్యానికి రూ.34 చొప్పున ఐదు కిలోల బియ్యానికి సమానమైన డబ్బును బీపీఎల్ ఖాతాదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నట్టు తెలిపింది. ఈ మేరకు బుధవారం జరిగిన కేబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకుంది. కేబినెట్ భేటీ నిర్ణయాలను రాష్ట్ర ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి కేహెచ్ మునియప్ప మీడియాకు వెల్లడించారు. 'ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ప్రకారం కిలో బియ్యానికి ప్రామాణిక ధర రూ.34గా ఉంది. బీపీఎల్(దారిద్ర్య రేఖకు దిగువున్న ఉన్నవారు) ఖాతాదారులకు ఉచితంగా బియ్యం పంపిణీ చేసేందుకు మేం విశ్వప్రయత్నాలు చేశాం. కానీ మన రాష్ట్రానికి అవసరమైన బియ్యాన్ని సరఫరా చేసేందుకు ఏ సంస్థా ముందుకు రావట్లేదు. ఇక, అన్నభాగ్య పథకాన్ని జులై 1 నుంచి ప్రారంభించాల్సి ఉంది. బియ్యం కొరత కారణంగా పథకం అమలును ఆపలేం. అందుకే అందుకు సమానమైన డబ్బులను ఇవ్వనున్నాం. బియ్యం అందుబాటులోకి వచ్చేవరకు.. కిలో బియ్యానికి రూ.34 చొప్పున నగదును అందిస్తాం. జులై 1 నుంచి ఈ నగదు

నేరుగా ఖాతాదారుల బ్యాంకు ఖాతాల్లో జమ అవుతుంది. ఒక రేషన్ కార్డులో ఒక వ్యక్తి ఉంటే నెలకు రూ.170 వస్తాయి. అదే ఇద్దరు వ్యక్తులైతే రూ.340, ఐదుగురు కుటుంబసభ్యులుంటే నెలకు రూ.850 జమ చేస్తాం' అని మంత్రి వివరించారు. అన్నభాగ్య పథకం కుటుంబంలో ప్రతి ఒక్కరికి నెలకు ఐదు కిలోల చొప్పున బియ్యాన్ని ఉచితంగా అందిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. ఇప్పటికే కేంద్రం అందిస్తున్న ఐదు కిలోల బియ్యానికి ఇది అదనం. అయితే ఇందుకు అవసరమైన ధాన్యం సేకరణ విషయంలో ఇటీవల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య మాటల యుద్ధం నడిచింది. అన్నభాగ్య పథకం అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం బియ్యం ఇచ్చేందుకు నిరాకరిస్తోందంటూ కాంగ్రెస్ ఆరోపిస్తుండగా.. బియ్యం ఇస్తామని తాము ఎలాంటి హామీ ఇవ్వలేదని కేంద్రం స్పష్టంగా చెప్పింది. దీంతో ఎన్నికల హామీలను అమలు చేయడంలో సిద్ధూ సర్కారు విఫలమైందంటూ బీజేపీ నేతలు విమర్శలు గుప్పించారు. ఈ నేపథ్యంలోనే కర్నాటక ప్రభుత్వం ఈ కీలక నిర్ణయం తీసుకుంది.

బాంబే ఐఐటీకి ప్రపంచస్థాయి గుర్తింపు

న్యూఢిల్లీ: ప్రపంచవ్యాప్తంగా 150 టాప్ యూనివర్సిటీలో భారత్‌కి చెందిన బాంబే ఐఐటీ స్థానం దక్కించుకుంది. దీనిపై కేంద్ర మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ బుధవారం సంతోషం వ్యక్తం చేశారు. క్వాక్వెరెల్లి సైమండ్స్ (క్యూఎస్) ప్రపంచ విశ్వవిద్యాలయాల ర్యాంకులనిస్తుంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న 150 టాప్ యూనివర్సిటీలో భారత్‌కి చెందిన ఐఐటీ బాంబే 149వ ర్యాంక్‌లో నిలిచింది. క్యూఎస్ ర్యాకింగ్ వెలువడిన అనంతరం ప్రపంచవ్యాప్త టాప్ యూనివర్సిటీల్లో ఐఐటీ బాంబే చేరి మైలురాయిని సాధించిందని ఆ యూనివర్సిటీ బుధవారం అధికారిక ప్రకటన వెల్లడించింది. ఇక ఈ విషయంపై కేంద్రమంత్రి రాజీవ్ మీడియాతో మాట్లాడుతూ.. 'వరల్డ్ టాప్ యూనివర్సిటీల్లో ఐఐటీ బాంబే ర్యాంక్ సాధించడం సంతోషంగా ఉంది. ఈ సందర్భంగా ఐఐటీకి నా అభినందనలు. ఈ ర్యాంక్‌లు ఇచ్చే క్యూఎస్ వ్యవస్థాపకుడు న్యూనిజికి కృతజ్ఞతలు. ఈ సంవత్సరం ర్యాంకింగ్ సిస్టమ్ కోసం 2,900 యూనివర్సిటీలకు ర్యాంక్స్ ఇచ్చారు. వీటిలో 45 భారతీయ విశ్వవిద్యాలయాలు ఉన్నాయి. ఈ ఏడాది క్యూఎస్ వరల్డ్ యూనివర్సిటీ ర్యాంకింగ్స్‌లో 45 భారతీయ విశ్వవిద్యాలయాలు చేరడం నాకు సంతోషంగా ఉంది. తొమ్మిదేళ్లలో ప్రధాని మోదీ భారత్‌లో ఉన్న విద్యను మార్చారు. దీంతో ప్రపంచస్థాయి యూనివర్సిటీల్లో మన యూనివర్సిటీలు చేరాయి. ఇప్పుడు తక్కువ మంది భారతీయులే మెరుగైన విద్య కోసం విదేశాలకు వెళతారు.

భారతీయ విద్య మంచిది కాదు అని ఇప్పుడు అనలేం. ఇది ప్రపంచంలోనే అత్యుత్తమైనది.' అని ఆయన అన్నారు.

ముంబైలో వర్ష బీభత్సం

వరద గుప్పిట్లో అనేక ప్రాంతాలు
లోతట్టు ప్రదేశాలు జలమయం

ముంబై: దేశంలో నైరుతి రుతుపవనాల వ్యాప్తి కాస్త ఆలస్యంగా మొదలైన సంగతి తెలిసిందే. అయితే, ముంబయిలో ప్రవేశించిన కొన్నిరోజులకే రుతుపవనాల ప్రభావం మొదలైంది. భారీ వర్షాలతో ముంబయి అతలాకుతలం అవుతోంది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో నగరంలోని అనేక ప్రాంతాలు వరద ముంపుకు గురయ్యాయి. మంగళవారం రాత్రి నుంచి కురుస్తున్న వర్షాలకు అంధేరీ సబ్ వే నీట మునిగింది. గోరేగావ్, విలేపార్లే, లోయర్ పారెల్ ప్రాంతాల్లోనూ వర్షబీభత్సం కనిపించింది. థానేలో రహదారులు జలమయం అయ్యాయి. అనేక చోట్ల ట్రాఫిక్ నిలిచిపోయింది. బోరివెలి వెస్ట్, ఎస్వీ రోడ్ ప్రాంతాల్లో రోడ్లపైకి నీరు చేరింది. నగరంలో కొన్ని ప్రాంతాల్లో చెట్లు నేలకొరిగాయి. విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. సబర్బన్ మలాడ్‌లో చెట్టు కూలిన సంఘటనలో ఒక వ్యక్తి మృతి చెందినట్లు బృహన్‌ముంబై మున్సిపల్ కార్పొరేషన్ (బీఎంసీ) ఒక ప్రకటనలో తెలిపింది. అనేక చోట్ల ఇళ్లు, గోడలు కూలిన ఘటనలు చోటుచేసుకున్నట్లు అధికారులు తెలిపారు. రైళ్లు కొన్ని నిమిషాలు ఆలస్యంగా నడుస్తున్నప్పటికీ సెంట్రల్, వెస్ట్రన్ రైల్వే రూట్లలో స్థానిక రైళ్ల రాకపోకలు సాధారణంగా ఉన్నాయని రైల్వే అధికారులు తెలిపారు. అంధేరి సబ్‌వేలో 1.5 నుండి 2 అడుగుల మేర నీరు చేరడంతో వాహనాల రాకపోకల నిలిపివేసి ట్రాఫిక్‌ను ఎస్వీ రోడ్ వైపు మళ్లించినట్లు అని ముంబై ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. భారీ వర్షాల కారణంగా చందన్‌వాడి ప్రాంతంలోని హౌసింగ్

సొసైటీ రక్షణ గోడ బుధవారం ఉదయం 11 గంటలకు కూలిపోయింది, అయితే ఈ సంఘటనలో ఎవరికీ గాయాలు కాలేదు. ముంబైలో బుధవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు గరిష్ఠంగా 98 మి.మీ వర్షపాతం నమోదైంది. థానేలో ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు 105 మి.మీ వర్షపాతం నమోదైంది. కాగా భారత వాతావరణ సంస్థ (ఐఎండీ) ముంబై, థానే ప్రాంతాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. మరో రెండ్రోజుల పాటు వర్షాలు కొనసాగుతాయని హెచ్చరించింది.

కోల్‌కతాలో భారీ వర్షం

కోల్‌కతా, దాని పరిసర ప్రాంతాలలో బుధవారం భారీ వర్షం కురిసింది. జనజీవనం అస్తవ్యస్తమైంది. కాగా దక్షిణ, ఉత్తర బెంగాల్‌లోని వివిధ ప్రాంతాలలో మరింతగా భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అంచనా వేసింది. డైమండ్ హార్బర్‌లో రాష్ట్రంలోనే గరిష్టంగా 214.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా కన్నింగ్‌లో బుధవారం ఉదయం 8.30 గంటల వరకు 24 గంటల్లో 58.4 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. రెండు పట్టణాలు దక్షిణ 24 పరగణాల జిల్లాలో ఉన్నాయి. కోల్‌కతాలో 40.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది, ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం కారణంగా నగరంలో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. అనేక ప్రాంతాలలో నీరు నిలిచిపోయింది. ప్రజా రవాణా వాహనాలు తక్కువ సంఖ్యలో అందుబాటులో ఉన్నందున గమ్య స్థానాలకు చేరుకోవడానికి ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. కొన్ని పాఠశాలలు సెలవు ప్రకటించాయి. దక్షిణ, ఉత్తర 24 పరగణాల కోస్తా జిల్లాల్లో గురువారం ఉదయం వరకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది.

ఉప-హిమాలయ జిల్లాలైన జల్పాయ్‌గురి, కూచ్ బెహార్, అలీపుర్‌దువార్‌లలో రాబోయే రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది.

సైన్యంలో రవికిషన్ కుమార్తె

న్యూఢిల్లీ: ప్రముఖ నటుడు, బీజేపీ ఎంపీ రవి కిషన్ కుమార్తె ఇషితా శుక్లా సైన్యంలో చేరారు. త్రివిధ దళాల్లో సైనిక నియామకాల కోసం కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన 'అగ్నిపథ్' పథకం కింద.. ఆమె అగ్నివీర్‌గా మారారు. ఈ విషయాన్ని రవికిషన్ సామాజిక మాధ్యమాల్లో వెల్లడిస్తూ.. సంతోషం వ్యక్తం చేశారు. ఢిల్లీ డైరెక్టరేట్‌కు చెందిన '7 గర్ల్ బెటాలియన్'లో ఆమె సభ్యురాలని వెల్లడించారు. ప్రస్తుతం ఆమె వయసు 21 సంవత్సరాలు. రవి కిషన్ చెప్పిన ఈ వార్తతో నెట్టింట్లో కామెంట్ల వర్షం కురిసింది. ఒక స్టార్ కుమార్తె అయిన ఆమె.. ఇలా భిన్నమైన కెరీర్ ఎంచుకోవడాన్ని అభినందించారు. ఆమె ప్రయాణం దేశయువతకు స్ఫూర్తి అంటూ ఎంపీ సహచరులు ప్రశంసించారు. 'సినిమా పరిశ్రమకు చెందిన నటీనటుల పిల్లల్లో కొందరైనా భిన్నమైన రంగాన్ని ఎంచుకుంటున్నందుకు సంతోషం. ఆమెకు అభినందనలు' అని ఒకరు రాసుకొచ్చారు. 'నాకు తెలిసి సైన్యంలో చేరిన మొదటి రాజకీయ నాయకుడి బిడ్డ ఆమే కావొచ్చు. భారత్ మారుతోంది' అని మరికొందరు అభిప్రాయపడ్డారు. రవి కిషన్ భోజ్‌పురి చిత్రపరిశ్రమకు చెందిన ప్రముఖ నటుడు. ఆయన హిందీతో పాటు దక్షిణాది సినిమాల్లో నటించారు. ఆయనకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు. రవికిషన్.. 2019 సార్వత్రిక ఎన్నికల్లో ఎంపీగా గెలిచారు. బీజేపీ తరపున గోరఖ్‌పూర్ నుంచి లోక్‌సభకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

అదానీకి నిధుల వరద

జీక్యూజీ భారీ పెట్టుబడి

న్యూఢిల్లీ: ప్రముఖ వ్యాపారవేత్త గౌతమ్ అదానీకి చెందిన అదానీ గ్రూప్‌లో అమెరికా ఈక్విటీ ఇన్వెస్ట్‌మెంట్ సంస్థ జీక్యూజీ పార్టనర్స్ తన వాటాను మరింత పెంచుకుంటోంది. గతంలో హిండెన్‌బర్గ్ నివేదిక వెలువడిన అనంతరం అదానీ గ్రూప్‌లో వాటాలు కొనుగోలు చేసిన జీక్యూజీ.. మరోమారు అదానీ గ్రూప్‌లో భారీగా పెట్టుబడి పెట్టింది. అదానీ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్, అదానీ గ్రీన్ ఎనర్జీలో దాదాపు 1 బిలియన్ డాలర్ల విలువైన షేర్లను జీక్యూజీ పార్టనర్స్‌తో పాటు, ఇతర ఇన్వెస్టర్లు కొనుగోలు చేశారు. అదానీ కుటుంబం నుంచి ఈ వాటాలను ఇన్వెస్టర్లు కొనుగోలు చేసినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. అదానీ ఎంటర్‌ప్రైజెస్‌కు చెందిన 1.8 కోట్ల షేర్లు బుధవారం బ్లాక్‌డీల్ ద్వారా చేతులు మారినట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. అదానీ గ్రీన్ ఎనర్జీకి చెందిన 3.52 కోట్ల షేర్లు సైతం ఇన్వెస్టర్లు కొనుగోలు చేసినట్లు పేర్కొన్నాయి. అదానీ ఎంటర్‌ప్రైజెస్ షేర్లను విలువ రూ.2,300 వద్ద, అదానీ గ్రీన్ ఎనర్జీ షేర్లను రూ.920 వద్ద అదానీ గ్రూప్ విక్రయించినట్లు తెలిసింది. అదానీ గ్రూప్ షేర్లలో వాటాల కొనుగోలు నేపథ్యంలో అదానీ గ్రూప్ స్టాక్స్ బుధవారం లాభాల్లో కొనసాగుతున్నాయి. జీక్యూజీ పార్ట్‌నర్స్‌ను భారత సంతతికి చెందిన రాజీవ్ జైన్ 2016 జూన్‌లో స్థాపించారు. ప్రస్తుతం ఆయన ఈ కంపెనీకి ఛైర్మన్, చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ ఆఫీసర్‌గా వ్యవహరిస్తున్నారు. గతంలో హిండెన్‌బర్గ్ నివేదిక వెలువడిన అనంతరం రుణాల తిరిగి చెల్లింపుల కోసం జీక్యూజీ.. వాటాల కొనుగోలు చేసి ఓ విధంగా అదానీ గ్రూప్ సంస్థను ఆదుకుంది. ఈ ఏడాది మార్చిలో మరోమారు రూ.15,446 కోట్లకు సెకండరీ మార్కెట్ బ్లాక్ లావాదేవీల ద్వారా అదానీ ఎంటర్‌ప్రైజెస్, అదానీ పోర్ట్స్, అదానీ గ్రీన్ ఎనర్జీ, అదానీ ట్రాన్స్‌మిషన్ కంపెనీల్లో జీక్యూజీ వాటాలను పొందింది. భవిష్యత్‌లోనూ అదానీ గ్రూప్‌లో వాటాలు కొనుగోలు చేస్తామని ఆ సంస్థ అధినేత రాజీవ్ జైన్ గతంలో ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. ఈ నేపథ్యంలోనే అదానీ గ్రూప్‌లోకి పెట్టుబడులను కొనసాగిస్తుండడం గమనార్హం.

బీజేపీలో భారీ మార్పులు

న్యూఢిల్లీ: రానున్న లోక్‌సభ ఎన్నికల్లో గెలుపు కోసం సంస్థాగత మార్పులు చేయడంపై భారతీయ జనతా పార్టీ అధిష్ఠానం దృష్టి సారించింది. జాతీయస్థాయిలో ముగ్గురు ప్రధాన కార్యదర్శులను, నలుగురు కార్యదర్శులను నియమించేందుకు సన్నాహాలు చేస్తోంది. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోశ్, కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఇప్పటికే దీనిపై చర్చించారు. ఆ పార్టీలోని విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ జాతీయ మీడియా ఈ వివరాలు తెలిపింది. నడ్డా, సంతోశ్, అమిత్ షా మధ్య జరిగిన చర్చల వివరాలను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి తెలియజేశారు. జాతీయస్థాయిలో ముగ్గురు ప్రధాన కార్యదర్శులను, నలుగురు కార్యదర్శులను నియమించబోతుండటం గురించి వివరించారు. ఈ మార్పులు రానున్న రెండు వారాల్లోనే కార్యరూపం దాల్చనున్నాయి. మరోవైపు మోదీ నేతృత్వంలోని కేంద్రమంత్రివర్గంలో కూడా మార్పులు జరిగే అవకాశాలు ఉన్నాయని బీజేపీ వర్గాలు చెప్తున్నాయి. ఉత్తరప్రదేశ్ నుంచి నలుగురికి, మధ్యప్రదేశ్ నుంచి ఒకరికి, రాజస్థాన్ నుంచి ఇద్దరికి, మహారాష్ట్ర నుంచి ఇద్దరికి మంత్రి పదవులు లభించే అవకాశం ఉన్నట్లు తెలిపాయి. మధ్యప్రదేశ్, రాజస్థాన్, కర్నాటక, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల బీజేపీ శాఖలలో కూడా సంస్థాగత మార్పులు త్వరలో జరగబోతున్నట్లు తెలుస్తోంది. రాజస్థాన్, మధ్యప్రదేశ్ శాసనసభ ఎన్నికలు ఈ ఏడాది చివరిలో జరగబోతున్న విషయం తెలిసిందే.

రాహుల్‌పై అనుచిత పోస్టు

బీజేపీ నేతపై కేసు

బెంగళూరు: కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీపై చేసిన ఓ ట్వీట్ భారతీయ జనతా పార్టీ ఐటీ విభాగం అధ్యక్షుడు అమిత్ మాలవ్యాకు సమస్యలు తెచ్చిపెట్టింది. కర్నాటక కాంగ్రెస్ నేత రమేశ్ బాబు ఫిర్యాదు ఆధారంగా బెంగళూరులోని హై గ్రౌండ్స్ పోలీస్ స్టేషన్‌లో బుధవారం మాలవ్యాపై కేసు నమోదైంది. ఏయే ట్వీట్లపై ఈ కేసు నమోదైందో స్పష్టంగా తెలియడం లేదు. అయితే ఆయన ఇటీవల రాహుల్‌గాంధీ అమెరికా పర్యటనపై ఇచ్చిన ట్వీట్‌లో రాహుల్ చాలా ప్రమాదకారి అని, ఆయన వంచన, మోసపూరిత ఆట ఆడుతున్నారని ఆరోపిం చారు. కాగా, కర్నాటక మంత్రి, కాంగ్రెస్ నేత ప్రియాంక్ ఖర్గే మాట్లాడుతూ న్యాయ సలహా తీసుకుని మాలవ్యాపై ఫిర్యాదు చేశామన్నారు. చట్టపరమైన చర్యలను ఎదుర్కొనాలని కోరిన ప్రతిసారీ బీజేపీ గగ్గోలు పెడుతోందన్నారు. దేశంలోని చట్టాల ను అనుసరించడం బీజేపీ నేతలకు సమస్య అని మండిపడ్డారు. ఎఫ్ఐఆర్‌లో ఏ భాగం దురుద్దేశపూరితమో చెప్పాలని డిమాండ్ చేశారు. ఇది తప్పు అనుకుంటే తమను చట్టబద్ధంగా ఎదుర్కొ నాలని సవాల్ చేశారు. దక్షిణ బెంగళూరు ఎంపీ, బీజేపీ నేత తేజస్వి సూర్య ట్వీట్‌లో రాజకీయ ఉద్దేశాలతోనే ఈ కేసు నమోదు చేశారని తెలిపారు. న్యాయం కోసం తాము కోర్టును ఆశ్రయిస్తామని తెలిపారు. రాహుల్ గాంధీకి వ్యతిరేకంగా మాలవ్యా ఇచ్చిన స్టేట్‌మెంట్‌పై ఐపీసీ సెక్షన్లు 153ఏ, 505(2) ప్రకారం కేసు నమోదు చేశారని, వర్గాల మధ్య శత్రుత్వాన్ని ప్రోత్సహించినపుడు ఈ సెక్షన్లు వర్తిస్తాయని తెలిపారు.

మధ్యప్రదేశ్‌లో ఘోర ప్రమాదం

12 మంది దుర్మరణం

భోపాల్: మధ్యప్రదేశ్‌లోని దతియా జిల్లా దుర్సాద పోలీస్ స్టేషన్ పరిధిలోని బుహ్రా గ్రామంలో బుధవారం తెల్లవారు జామున 3 గంటల సమయంలో ఘోర ప్రమాదం జరిగింది. వంతెన దాటుతుండగా మినీ ట్రక్కు అదుపుతప్పి నదిలో పడిపోవడంతో 12మంది మృతి చెందారు. ఐదుగురి మృతదేహాలు లభ్యం కాగా మిగిలిన వారు గల్లంతయ్యారు. మృతులంతా ఒకే కుటుంబానికి చెందినవారుగా పోలీసులు గుర్తించారు. గ్వాలియర్‌లోని భేలేటి గ్రామం నుంచి తికమ్‌గఢ్‌లోని జాతర గ్రామానికి పెళ్లి వేడుకల కోసం వీరంతా మినీ ట్రక్కులో వెళుతున్నారు. ట్రక్కులో దాదాపు 50 మంది కూలీలున్నారు. ట్రక్ డ్రైవర్ వాహనంపై నియంత్రణ కోల్పోవడంతో ప్రమాదం జరిగినట్టు భావిస్తున్నారు. ప్రమాదంలో 12 మందికిపైగా మృతి చెందినట్లు తెలుస్తోంది. ఐదుగురి మృతదేహాలు లభ్యమయ్యాయి. సమాచారం అందిన వెంటనే గ్రామస్థులు అక్కడికి చేరుకుని ట్రక్కులోని వారిని రక్షించే ప్రయత్నం చేశారు. అధికార యంత్రాంగం హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకుంది. నదిలో పడిన వారిని రక్షించేందుకు సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను ఆసుపత్రులకు తరలించారు. ఇప్పటికీ కొంతమంది వ్యక్తుల ఆచూకీ తెలియడం లేదని, ఎస్‌డీఆర్ఎఫ్ బృందం ఘటన స్థలంలో సహాయక చర్యలు కొనసాగిస్తోందని అధికారులు తెలిపారు. సహాయక చర్యలు కొనసాగుతున్నాయని మధ్యప్రదేశ్ హోంమంత్రి నరోత్తమ్ మిశ్రా తెలిపారు. బాధిత కుటుంబాలకు అన్ని విధాలా సాయం చేయాలని అధికారులను ఆదేశించారు.

వ్యతిరేక ప్రచారంతోనే ఫాసిజం ఓటమి

ఏఐవైఎఫ్ రాష్ట్ర స్థాయి యువజన సమ్మేళనంలో వక్తల పిలుపు

విశాలాంధ్ర-గుంటూరు: ప్రస్తుత సమాజంలోని అన్ని రంగాల్లో వేళ్లూనుకుని ఉన్న ఫాసిజాన్ని ఓడించడానికి ఫాసిజ వ్యతిరేక ప్రచారం విస్తృతంగా జరగాలని వీక్షణం మాస పత్రిక ఎడిటర్ ఎన్.వేణుగోపాల్ అన్నారు. అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర స్థాయి విద్య, వైజ్ఞానిక, సాంస్కృతిక సమ్మేళనం గుంటూరు శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో రెండో రోజు బుధవారం కొనసాగింది. శిక్షణా తరగతుల్లో భాగంగా జరిగిన కార్యక్రమానికి ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎన్.లెనిన్‌బాబు ప్రిన్సిపాల్‌గా, వైస్ ప్రిన్సిపాల్స్‌గా పరుచూరి రాజేంద్ర, గంగా సురేష్, పవిత్ర వ్యవహరించారు. 'ఫాసిజ ప్రమాదం-యువత ముందున్న కర్తవ్యాలు' అనే అంశంపై వేణుగోపాల్ యువతకు బోధించారు. 20వ దశాబ్దంలో ఇటలీ, జర్మనీలలో విస్తరించిన ఫాసిజంతో పోల్చిచూస్తే నేడు భారతదేశంలో అంత కంటే ప్రమాదకర ఫాసిజం విస్తరించి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. మనుస్మృతితో ఈ ఫాసిజం కలిసి ప్రయాణించడమే ఇది అత్యంత ప్రమాదకరంగా మారడానికి కారణమైందని అభిప్రాయపడ్డారు. రాబోయే ప్రమాదాన్ని ఇప్పుడే గుర్తించి ఈ ఫాసిజాన్ని ఎదుర్కొనడానికి యువత కీలక పాత్ర పోషించాలన్నారు. కేవలం పాలన మారడంతో ఫాసిజం ఓడినట్లు కాదని, ప్రజల్లో పాతుకుపోయిన భావ జాలాన్ని మార్చాలని యువతకు సూచించారు. దీనికోసం ఫాసిజ వ్యతిరేక ప్రచారం విస్తృతంగా జరగాలన్నారు. దీనికి అవసరమైన సైద్ధాంతిక సైనిక శక్తి ఏఐవైఎఫ్ రూపంలో సిద్ధంగా ఉందని అన్నారు. బీజేపీ తిరిగి అధికారంలోకి వస్తే ఫాసిజం ఏ స్థాయిలో పెచ్చరిల్లుతుందో వివరించాలన్నారు. అప్పుడే ఫాసిజాన్ని ఎదుర్కొని ఓడించగలమన్నారు. 'స్వాతంత్ర్య ఉద్యమంలో యువ విప్లవకారుల పాత్ర' అనే అంశంపై ఎస్వీ యూనివర్సిటీ ప్రొఫెసర్ కె.రాజశేఖర్ మాట్లాడుతూ మంగళ్‌పాండే నుంచి ఉద్దమ్‌సింగ్, కన్నెగంటి హనుమంతు, అల్లూరి సీతారామరాజు, శాంతి, సునీత, భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్, చంద్రశేఖర్ ఆజాద్, వుల్లాఖాన్ వరకు స్వాతంత్ర్య పోరాటంలో వారు చేసిన త్యాగపూరిత పోరాటాలను కూలంకుషంగా వివరించారు. వారి స్ఫూర్తితో వారి వారసత్వాన్ని పుణికిపుచ్చుకున్న ఏఐవైఎఫ్ రక్తతర్పణాలతో పుట్టిందని గుర్తుచేశారు. ప్రజాసంఘాలకు జీవనాడిగా ఏఐవైఎఫ్ నిలిచిందన్నారు. జనవిజ్ఞాన వేదిక వ్యవస్థాపక సభ్యులు డాక్టర్ వి.బ్రహ్మారెడ్డి 'నైతిక విలువలు-భావ ప్రకటన నైపుణ్యాలు-ఉద్యమాలలో పనిచేసే వారు ఎలా ఉండాలి' అనే అంశంపై ప్రసంగించారు. ఉద్యమాల్లో పనిచేసే వారు సంసిద్ధత, అవకాశం, జ్ఞానం, నైపుణ్యం వంటి నాలుగు లక్షణాలు కలిగి ఉండాలన్నారు. భావ ప్రకటన నైపుణ్యం, దృక్పథం కలిగి ఉండాలని సూచించారు. రానున్న రోజుల్లో యూనిఫామ్ సివిల్ కోడ్ రూపంలో పెద్ద ప్రమాదం పొంచి ఉందని ఏఐవైఎఫ్ పటిష్టంగా ఉంటే ఇటువంటి కోడ్‌లను ఎదుర్కోవడంతో పాటు భారత రాజ్యాంగాన్ని కూడా రక్షించుకోగలమని అన్నారు. అనంతరం ఎన్.వేణుగోపాల్ రచించిన 'కాషాయసారం (ఆర్ఎస్ఎస్, సంఘ్ పరివార్ నిర్మాణం) పుస్తకాన్ని ఆవిష్కరించారు. అల్పాహార విరామం తరువాత 'వ్యక్తిత్వ వికాసం-నిపుణత' అనే అంశంపై చంద్రశేఖర్, ప్రజా కళాకారులు, రచయిత, గాయకుడు చుక్కా రామ్ నరసయ్య పాట-మాట కార్యక్రమం నిర్వహించారు. ఆయా కార్యక్రమాలలో ఏఐవైఎఫ్ జాతీయ మాజీ కార్యదర్శి జి.ఈశ్వరయ్య, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జంగాల అజయ్‌కుమార్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్ బాబు, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు చంద్రానాయక్ పాల్గొన్నారు.

రెండోరోజు కొనసాగిన గేయాలాపన

ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు చంద్రానాయక్, చిన్నం పెంచలయ్య ఆధ్వర్యంలో రెండో రోజు చైతన్యవంతమైన గేయాలతో యువతను ఉత్సాహపరిచారు. 'యువతరమా మేలుకో... మగతనిద్ర మానుకో...' అంటూ ఏఐవైఎఫ్ నాయకులు కూడా ప్రజానాట్యమండలి కళాకారులతో కలిసి తమ గళాన్ని వినిపించడం విశేషం.

అవినీతిలో బీజేపీది ప్రత్యక్ష పాత్ర

దత్తపుత్రుల దోపిడీ లెక్కలు తేల్చాలి: నారాయణ

విశాలాంధ్ర బ్యూరో-ముంబై/అమరావతి: దేశంలో జరిగే మొత్తం అవినీతిలో బీజేపీకి ప్రత్యక్ష పాత్ర ఉందని, రాష్ట్రాల వారీగా దత్తపుత్రుల్ని పెట్టుకుని అవినీతి రాజ్యమేలుతోందని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ విమర్శించారు. ముంబైలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ అవినీతి పాలనపై ధ్వజమెత్తారు. కేసీఆర్ కుమార్తె సహా జమ్ముకశ్మీర్ నుంచి తమిళనాడు వరకు అంతా కుటుంబ పాలనే సాగుతోందని, జాతీయస్థాయిలోనూ కాంగ్రెస్‌ది కుటుంబ పాలనని, వారి కోసమే ఓట్లు వేయలా? దేశం కోసం ఓట్లు వేయరా? అంటూ ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలపై నారాయణ ఘాటుగా స్పందించారు. దేశవ్యాప్తంగా బీజేపీ దత్తపుత్రులు ఎంత తిన్నారో?, మిగిలిన వారెంత అవినీతికి పాల్పడ్డారో లెక్కలు తీస్తే తమకు ఎలాంటి అభ్యంతరం లేదని నొక్కిచెప్పారు. ఇదే సమయంలో దేశంలోనూ, రాష్ట్రంలోనూ కుటుంబ పాలనతో వారెంత అవినీతికి పాల్పడ్డారో?, బీజేపీ అధికారంలోకి వచ్చాక బీజేపీ దత్తపుత్రులు 30 మంది ఎంత దోచుకుతిన్నారో లెక్కచెప్పాలని నిలదీశారు. బీజేపీకి మరో పుత్రుడు అదానీ అని విమర్శించారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక లక్షల కోట్లు ఎగ్గొట్టి విదేశాలకు చాలామంది వెళ్లిపోయారని గుర్తుచేశారు. ఇక్కడే ఉన్న పెద్ద దత్తపుత్రుడు దేశ సంపదను దోచుకుంటుంటే మోదీ వాళ్లకు సహకరిస్తున్నారని ధ్వజమెత్తారు. తొమ్మిదేళ్లలో బీజేపీ దత్తపుత్రులు దోచుకున్నదీ, ప్రాంతీయ పార్టీల కుటుంబ పాలనతో దోచుకున్న దానిపై లెక్కలు తీస్తే వాస్తవాలు వెలుగు చూస్తాయన్నారు. దేశంలోని నేరపూరిత సంప్రదాయానికి కేంద్ర హోంమంత్రి అమిత్‌షా బాధ్యత వహిస్తున్నారన్నారు. ఈ దేశాన్ని ముక్కలు చేయడానికి, విచ్ఛిన్నం చేయడానికి ప్రయత్నిస్తున్న మీరా...తమ గురించి మాట్లాడేదని బీజేపీపై నారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు.

బుగ్గన బృందంపై మరోసారి తేనెటీగల దాడి

విశాలాంధ్ర-బేతంచెర్ల రూరల్: నంద్యాల జిల్లా, కనుమకింది కొట్టాల గ్రామంలో బుధవారం ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి బృందంపై తేనెటీగల దాడి కలకలం రేపుతోంది. ఆయన సహజ సిద్ధంగా ఏర్పడిన ఎర్రజాల గుహలను పర్యాటక కేంద్రంగా ఏర్పాటు చేసేందుకు కొంత కాలంగా కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగా జిల్లా స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధుల బృందంతో గుహలను పరిశీలించేందుకు వెళ్లారు. ఎర్రజాల గుహల సందర్శనలో అధికారులకు తగిన సూచనలు, సలహాలు ఇస్తున్న తరుణంలో ఒక్కసారిగా కొండచరియలకు ఉన్న తేనెటీగలు విచక్షణారహితంగా దాడి చేశాయి. అక్కడే ఉన్న మంత్రి బుగ్గనను పోలీసులు, కార్యకర్తలు చుట్టుముట్టి రక్షించుకోగా, తక్కిన 79 మందిని వెంటాడి తేనెటీగలు దాడి చేశాయి. 76మందికి బేతంచెర్ల ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది వైద్యం అందించి, డిశ్చార్జి చేయగా బుగ్గాని పల్లె రాముడు, సెక్రటరీ స్వామినాయక్, టూరిజం సిబ్బంది గణేష్ పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం కర్నూలు సర్వజన ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా తేనెటీగలు మంత్రి బుగ్గన బృందం పై దాడి చేయడం ఇది రెండోసారి. గతంతో మంత్రి సీతారామాపురం గ్రామానికి రోడ్డు వేసి, పాదయాత్ర నిర్వహిస్తున్న సందర్భంగా ఆ రోజు దాడి చేస్తే, ఇద్దరు పత్రికా విలేకర్లు, ఇద్దరు ప్రజా ప్రతినిధులు తీవ్రంగా గాయపడి, ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న సందర్భంలో మళ్లీ ఇప్పుడు ఇలా జరగడం సర్వత్రా చర్చనీయాంశమైంది.

వరల్డ్‌కప్ ఎఫెక్ట్
కొండెక్కిన హోటల్ రూమ్ అద్దెలు

అహ్మదాబాద్: వన్డే ప్రపంచ కప్ మెగా టోర్నీకి ఇంకా వంద రోజుల సమయం ఉంది. ఇప్పటికే షెడ్యూల్‌ను ఐసీసీ విడుదల చేసిన విషయం తెలిసిందే. అక్టోబర్ 5 నుంచి అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం వేదికగా తొలి మ్యాచ్ ప్రారంభం కానుంది. అక్టోబర్ 15న ఇదే స్టేడియంలో భారత్-పాకిస్థాన్ మ్యాచ్ జరగనుంది. ఫైనల్ సహా ఐదు మ్యాచ్‌లు అహ్మదాబాద్ వేదికలోనే జరుగు తాయి. ఈ క్రమంలో అహ్మదాబాద్‌లో హోటల్ రూమ్ అద్దెలు ఆకాశాన్ని తాకాయి. సాధారణ రోజుల్లో రూ. 6,500 నుంచి రూ. 10,500 ఉండే ఫైవ్ స్టార్ హోటల్ గది అద్దె ఏకంగా.. రూ. 50 వేలు దాటిపోవడం గమనార్హం. మూడు నెలల ముందు బుక్ చేసుకున్నా ఇదే టారిఫ్ ఉన్నట్లు హోటల్ ఇండస్ట్రీ వర్గాలు పేర్కొన్నాయి. బేస్ కేటగిరీ గదుల టారిఫ్ రూ.52 వేలు ఉండగా.. ప్రీమియమ్ కేటగిరీ గదుల అద్దె రోజుకు రూ.లక్షకుపైగా ఉండే అవకాశాలు ఉన్నట్లు తెలి పాయి. "భారత్, పాకిస్తాన్ మ్యాచ్ కోసం భారీగా అభిమానులు తరలివస్తారు. దీంతో అక్టోబర్ 13 నుంచి 16 వరకు బుకింగ్‌లను ఇప్పటికే ప్రారం భించారు. ఎక్కువగా మ్యాచ్ రోజుల్లోనే మరిన్ని బుకింగ్‌లు అవుతాయని భావిస్తున్నాం" అని ఐటీసీ నర్మదా జనరల్ మేనేజర్ కీనన్ మెకంజీ వెల్లడించారు. అభిమానులు, స్పాన్సర్లు, వీవీఐపీల సందడి ఉంటుందని పేర్కొన్నారు. ఐదు నక్షత్రాల హోటల్స్‌లో 60-90 శాతం వరకు మ్యాచ్‌ల కోసమే బుక్ అవుతాయని హయత్ రెగెన్సీ జీఎం పునీత్ బైజల్ తెలిపారు. "మా ప్రాపర్టీస్‌లోని రెండింట్లోని గదులను అక్టోబర్ 14-16 వరకు బుక్ చేసేశాం. దాదాపు 40 నుంచి 60 శాతం వరకు మిగతా మ్యాచ్‌ల సమయాల్లోనూ బుక్ చేయడం జరిగింది. ఇంకా కొన్ని రూమ్‌లు అందుబాటులో ఉన్నాయి" అని తాజ్ గ్రూప్ ప్రాపర్టీస్‌ను నిర్వహిస్తున్న శంకల్ప్ గ్రూప్ వైస్ ప్రెసిడెంట్ అతుల్ బుద్ధరాజ వివరించారు.

2 వేల ఇళ్లలో లక్షా ఎనభైవేల ఓటర్లా?

- అచ్చెన్న ఆగ్రహం
- ఓట్ల అవకతవకలపై ఈసీకి టీడీపీ ఫిర్యాదు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: నాలుగేళ్లలో రాష్ట్రంలోని అన్ని వనరులను దోచుకున్న వైసీపీ దొంగల ముఠా ఎన్నికల ఏడాది ఓట్ల దొంగతనానికి తెరతీసిందని టీడీపీ ఏపీ అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లోనూ టీడీపీ సానుభూతిపరుల ఓట్లను తొలగించడమే కాదు భారీగా దొంగఓట్లు సృష్టిస్తున్నారని అన్నారు. వాలంటీర్లు, బీఎల్ఓల ద్వారా ఈ అవకతవకలకు పాల్పడుతున్నారని అచ్చెన్నాయుడు తెలిపారు. రాష్ట్రంలో ఓట్ల అవకతవకల వ్యవహారంపై టీడీపీ నేతలు బుధవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేశ్‌కుమార్ మీనాకి ఫిర్యాదు చేశారు. ఆమేరకు లిఖితపూర్వకంగా ఆధారాలను అందజేశారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడి నేతృత్వంలో దేవినేని ఉమా, బొండా ఉమా, నక్కా ఆనంద్ బాబు, పరుచూరి అశోక్ బాబు, వర్ల రామయ్య తదితరులు బృందంగా వెళ్లి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారిని కలిశారు. అనంతరం ఓట్ల తొలగింపు, దొంగ ఓట్ల నమోదు విషయాలను ఈసీ దృష్టికి తీసుకెళ్లారు. అధికార పార్టీకి చెందిన నాయకులు కావాలనే టీడీపీ సానుభూతిపరుల ఓట్లను తొలగిస్తున్నారని తెలియజేశారు. అనంతరం అచ్చెన్నాయుడు మీడియాతో మాట్లాడుతూ... ఆంధ్రప్రదేశ్‌లో దొంగలు పడ్డారని తెలుగుదేశం పార్టీ 2019లోనే చెప్పిందన్నారు. ఒకే ఇంట్లోని ఓటర్లను వేర్వేరు కేంద్రాలకు మార్చేస్తున్నారని దుయ్యబట్టారు. ఒకే ఇంటి నంబర్‌పై వందల సంఖ్యలో ఓట్లను నమోదు చేసి గందరగోళం సృష్టిస్తున్నారన్నారు. వైఎస్సార్సీపీకి చెందిన నాయకులు కావాలనే ఓట్ల జాబితాల నుంచి టీడీపీ సానుభూతి పరుల ఓట్లను తొలగిస్తున్నారని ఆగ్రహించారు. వీటిన్నంటినీ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి దృష్టికి తీసుకెళ్లి... విచారణ చేయించాలని ఎన్నికల సంఘాన్ని కోరామన్నారు. కేవలం 2150 ఇళ్ల నంబర్లతో ఏకంగా లక్షా ఎనభైఐదు వేల ఓటర్లను చేర్పించారంటే ఏ స్థాయిలో దొంగఓట్లను సృష్టిస్తున్నారో అర్థంచేసుకోవచ్చని అచ్చెన్నాయుడు అన్నారు. ఒక్కో ఇంటి నంబరుతో వందలాది ఓట్లు నమోదవుతున్నాయని అన్నారు. ఏపీలో జరుగుతున్న దొంగఓట్ల వ్యవహారం కచ్చితంగా ఎనిమిదో వింతేనని అచ్చెన్నాయుడు ఎద్దేవా చేశారు. ఓట్ల అవకతవకలపై చర్యలు తీసుకుంటామని, ఓటరు జాబితాలను తనిఖీ చేస్తామని ఎన్నికల ప్రధానాధికారి హామీ ఇచ్చారని అచ్చెన్నాయుడు తెలిపారు. తనిఖీలో సాంకేతిక పరిజ్ఞానాన్ని కూడా వాడాలని టీడీపీ తరపున తాము కోరామన్నారు. అక్టోబర్ నాటికి ముసాయిదా జాబితా వస్తుందని, ఆలోగా పొరపాట్లను సవరిస్తామని సీఈవో చెప్పినట్లు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. ఈ అక్రమాల్లో కలెక్టర్లు ఉన్నా, ఎమ్మార్వోలు ఉన్నా కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారన్నారు.

8, 9 తేదీల్లో యువ మహిళా కార్మిక నేతల వర్క్‌షాప్

విశాలాంధ్ర-ఒంగోలు: ఏఐటీయూసీలో పనిచేసే యువ మహిళా కార్మిక నేతల వర్క్ షాప్ రాష్ట్రవ్యాప్తంగా జులై 8, 9వ తేదీల్లో నిర్వహించనున్నట్లు ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్ర నాథ్ తెలిపారు. ప్రకాశం జిల్లా ఒంగోలులోని మల్లయ్య లింగం భవనంలో బుధవారం ఏఐటీయూసీ జిల్లా సమితి ఆధ్వర్యంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఏఐటీయూసీ అనుబంధంగా ఉన్న పబ్లిక్, ప్రైవేట్ సెక్టార్లలో, ప్రభుత్వ రంగ స్కీముల్లో పనిచేసే కార్యకర్తలకు రెండు రోజులపాటు వివిధ రంగాలకు చెందిన ప్రొఫెసర్లు వివిధ సమస్యల పై వర్క్ షాప్ నిర్వహిస్తారన్నారు. రాష్ట్రంలో అన్ని ప్రాంతాల నుంచి సుమారు 200 మంది ఈ కార్యక్రమానికి హాజరవుతారని పేర్కొన్నారు. 8వ తేదీ ఉదయం 10గంటలకు మల్లయ్య లింగం భవన్‌లో ఏఐటీయూసీ జాతీయ కార్యదర్శి నిజాం వహీదా ప్రారంభ ఉపన్యాసం చేస్తారని, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీ ఓబులేసు కూడా పాల్గొంటారని తెలిపారు. వివిధ రంగాల్లో పనిచేసే మహిళలకు వారి వారి వృత్తుల్లో నైపుణ్యం పొందటానికి, పని ప్రదేశాల్లో వారికి ఎదురయ్యే సమస్యల పరిష్కారం కొరకు, సమాజంలో మహిళలు స్వయం శక్తితో ఎదగడానికి ఉన్న ఉపాధి అవకాశాలను ఏ విధంగా సద్వినియోగం చేసుకోవాలి అనే అంశాల పైన, నేడు ఉన్న చట్టాలు ఏ విధంగా దుర్వినియోగం మవుతున్నాయి, వాటిని తిరిగి సాధించుకోవడానికి ఉన్న అవకాశాలను పరిశీలించి సమాజంలో మహిళలు పోరాటాలకు సమాయత్తమయ్యే అవకాశాలపై కూడా అవగాహన కల్పించేందుకు ఈ వర్క్ షాప్ ఉపయోగపడుతుందన్నారు. ఈ వర్క్ షాప్ విజయవంతానికి అన్ని విధాల సహకరించాలని కార్మిక వర్గాలను కోరారు. జిల్లా ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు, నగర సీపీఐ కార్యదర్శి పీవీఆర్ చౌదరి పాల్గొన్నారు.

లార్డ్స్ మైదానంలోకి దూసుకొచ్చిన నిరసనకారులు

లండన్: లార్డ్స్ మైదానం వేదికగా ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా మధ్య బుధవారం యాషెస్ రెండో టెస్టు ప్రారంభమైంది. తొలి సెషన్ ప్రారంభమైన కొద్దిసేపటికే మైదానంలో అనూహ్య సంఘటన చోటు చేసుకుంది. ఇద్దరు నిరసన కారులు భద్రతా సిబ్బంది కళ్లుగప్పి మైదానంలోకి దూసు కొచ్చారు. దీంతో ఆటగాళ్లతోపాటు స్టేడియంలో మ్యాచ్‌ను వీక్షిస్తున్న ప్రేక్షకులు గందరగోళానికి గురయ్యారు. నిరసనకారులు మైదానంలోకి చొచ్చుకెళ్లిన విషయాన్ని గమనించిన భద్రతా సిబ్బంది వారిని పట్టుకునేందుకు పరుగెత్తుకొచ్చారు. అంతలోపే ఈ నిరసనకారులు తమ వెంట తెచ్చుకున్న ఆరెంజ్ కలర్ పౌడర్‌ని మైదానంలో చల్లారు. ఇంగ్లాండ్ వికెట్ కీపర్ జానీ బెయిర్ స్టో నిరసనకారుల్లో ఒకరిని అమాంతం ఎత్తుకెళ్లి బౌండరీ అవతల పడేశాడు. మరొక నిరసనకారుడిని భద్రతా సిబ్బంది మైదానం నుంచి బయటకు తీసుకెళ్లారు. మైదానంలోకి దూసుకెళ్లడానికి యత్నించిన మరో నిరసనకారుడిని అదుపులోకి తీసు కున్నారు. తర్వాత సిబ్బంది మైదానాన్ని శుభ్రం చేశారు. అనంతరం మ్యాచ్ యథావిధిగా కొనసాగింది. నిరసన కారుల ఆందోళన వల్ల దాదాపు ఆరు నిమిషాలపాటు ఆటకు అంతరాయం కలిగింది. తొలి సెషన్ రెండో ప్రారంభానికి ముందు ఈ సంఘటన జరిగింది. ఈ నిరసనకారులను 'జస్ట్ స్టాప్ ఆయిల్' అనే గ్రూప్‌నకు చెందిన కార్యకర్తలుగా గుర్తించారు. పర్యావరణ పరిరక్షణ కోసం ఈ గ్రూప్ కొంతకాలంగా ఉద్యమిస్తోంది. ఈ సంఘటనకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.